www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
గురువారం | 15 | మే | 2025 పేజీలు 8

## అభివృద్ధి పనులు పది కాలాల పాటు ఉండేలా నాణ్యతతో చేపట్టాలి



-రఘునాథపాలెం మండలం చింతగుర్తిలో రోడ్లు, డ్రైన్ నిర్మాణ పనులకు మంత్రి తుమ్మల శంకుస్థాపన

2వ

# అభివృద్ధికి నమూనాగా మధిర



-ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు
-ఇండ్లు లేని వారికి ఇందిరమ్మ ఇండ్లు
-ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క

**ప్రజాపక్షం/ఖమ్మం :** అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమల్లో రాష్ట్రంలోనే మధిర నియోజక వర్గం నమూనాగా ఉంటుందని ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టివిక్రమార్క తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ కార్యక్రమాలను అందిస్తామని ఇండ్లు లేని పేదలందరికీ రాష్ట్ర వ్యాప్తంగా ఇండ్లు నిర్మించనున్నామని ఆయన తెలిపారు. విక్రమార్క బుధవారం ఖమ్మంజిల్లా మధిర నియోజక వర్గంలో పర్యటించారు. ఎర్రుపాలెం మండల కేంద్రంలో 50 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు విక్రమార్క శంకుస్థాపన చేశారు. ఎర్రుపాలెం, బోనకల్ మండలాల్లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. కంద్రిక నుండి పెద్దగోపవరం వరకు రూ. 2.62 కోట్లతో నిర్మించే రోడ్డుకు శంకుస్థాపన చేశారు. బనిగండ్లపాడు గ్రామంలో రూ.5.74 లక్షలతో నిర్మించనున్న

మిగతా 2లో..

# మొదలైన కార్పోరేట్ చదువుల దోపిడీ..!

- ప్రైవేటు స్కూళ్లు, జూ.కళాశాలల జోరు ప్రచారం
- నియంత్రణ లేకపోవడంతో ఎవరి దోపిడీ వారిదే
- బడికో రేటు.. కాలేజీకో ధర
- ఫీజు రీయంబర్స్‌మెంట్‌లు రాక విద్యార్థుల అవస్థలు
- అర్హతలేని ఉపాధ్యాయులు, అధ్యాపకులు
- ప్రభుత్వ నిబంధనలు అమలయ్యేనా..!




**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** జిల్లాలో చదువులు దోపిడీ అప్పుడే మొదలైంది. కార్పోరేట్ స్థాయి బడులు, కళాశాలలు తమ సత్తా ఇంతా అంటే తమ సంతా అంతా అంటూ రంగురంగుల కరపత్రాలు ముద్రించి పంచుతున్నారు. మరోప్రక్క ఇంటింటి ప్రచారాన్ని నిర్వహిస్తూ తమ స్కూల్లో చేర్పించండీ,మా కాలేజీలో చదువులు బాగుంటాయి, ఇవిగో మార్కుల పంటలు అంటూ చెవులు చిల్లులు పడేలా గుక్కతిప్పుకోకుండా చెబుతూపోతున్నారు. ఈ జోరు ప్రచారంలో వారు చెప్పే మాటలతో విస్తుపోతున్న విద్యార్థులు తల్లిదండ్రులు ఎక్కడ చేర్పించాలో అంతుపట్టక తలలు పట్టుకుంటున్నారు.

### ఎవరి దోపిడీ వారిదే...

అన్నిదానాల్లో కల్లా విద్యాదానం గొప్ప అన్న నానుడి ఉండనే ఉంది. కానీ నేడు అన్ని దోపిడీల్లో కల్లా విద్యాదోపిడే ఎక్కువైంది. తల్లిదండ్రుల ఆశలను ఆసరాగా చేసుకుని

మిగతా 2లో..

# సంపద పంచుడు సరే.. సంక్షేమ పథకాలు అందించండి




-అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు
-పింఛన్, రేషన్ కార్డులు మంజూరు చేయకపోతే ఆందోళన తప్పదు : దండి సురేష్
- కార్పోరేషన్ కార్యాలయాన్ని ముట్టడించిన సిపిఐ



**ప్రజాపక్షం/ఖమ్మం :** సంపద పెంచి పేదలకు పంచుతామని చెబుతున్న ప్రభుత్వం ముందుగా సంక్షేమ పథకాలను పేదలందరికీ వర్తింపజేయాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ డిమాండ్ చేశారు. సంక్షేమ పథకాల అమలులో రాజకీయ వివక్ష తగదని ఆయన హితవు పలికారు. ఖమ్మం కార్పోరేషన్ పరిధిలోని సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సిపిఐ నగర సమితి ఆధ్వర్యంలో బుధవారం కార్పోరేషన్ కార్యాలయాన్ని ముట్టడించారు. అంతకు ముందు ప్రదర్శన నిర్వహించారు. కార్పోరేషన్ కార్యాలయంలో చొచ్చుకు వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులకు సిపిఐ కార్యకర్తలకు నడుమ తోపులాట జరిగింది. గేట్లు ఎక్కి లోపలకు వెళ్లేందుకు ప్రయత్నించిన సిపిఐ కార్యకర్తలను పోలీసులు అడ్డుకున్నారు. దీనితో సిపిఐ కార్యకర్తలు కార్యాలయం ముందు బైఠాయించారు. ఆందోళనకారులను ఉద్దేశించి దండి సురేష్ మాట్లాడుతూ సంక్షేమ పథకాల అమలులో ప్రభుత్వ వైఫల్యం

మిగతా 2లో..

# అభివృద్ధికి నమూనాగా మధిర

(మొదటిపేజీ తరువాయి)



బిటి రోడ్డుకు బోనకల్ మండలం కలకోట నుండి మోటమర్రి వరకు రూ. 20 కోట్లతో చేపట్టనున్న రోడ్డు విస్తరణ పనులకు రూ. 10 లక్షలతో నిర్మించనున్న అంగన్‌వాడీ భవనానికి, రూ. 12 లక్షలతో నిర్మించనున్న మత్స్య కార భవనానికి ఆయన శంకుస్థాపన చేశారు. రావి నూతల గ్రామంలో రూ. 2.80 కోట్లతో నిర్మించే రావినూతల నుంచి ఆళ్లపాడు వరకు రోడ్డు నిర్మాణ పనులకు రూ. 8 కోట్లతో నిర్మించే రావినూతల నుంచి గోవిందాపురం వరకు బిటి రోడ్డు పునర్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా విక్రమార్క మాట్లాడుతూ అభివృద్ధి పనులు వేగంగా, నాణ్యతతో జరగాలని ఆయన తెలిపారు. పదేళ్లు బిఆర్ఎస్ పార్టీ ప్రజలను మోసం చేసిందని సొంతానికి తప్ప ప్రజలకు ఏ మాత్రం ఉపయోగపడలేదని ఆయన ఆరోపించారు. ధనిక రాష్ట్రాన్ని బిఆర్ఎస్ చేతిలో పెడితే పాలన గాలికి వదిలి ఏడు లక్షల కోట్లు అప్పులు చేసి వెళ్లిపోయారని ఆయన తెలిపారు. ఆదాయం లేకపోయినా అప్పులకు వడ్డీలు చెల్లిస్తూ మొదటి ఏడాదిలోనే పెద్ద ఎత్తున సంక్షేమ పథకాలను అమలు చేశామని ఆయన తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా వైద్య శాఖకు రూ. 11,600 కోట్లు ఖర్చు పెడుతున్నామని ఆయన తెలిపారు. ఈ ఏడాది నుంచి ప్రతి నియోజక వర్గంలోనూ 3,500 ఇండ్లు నిర్మిస్తున్నామని ఇందుకు రూ. 22,500 కోట్లు కేటాయించామని తెలిపారు. అటవీ హక్కు చట్టం ద్వారా పట్టా పొందిన రైతులందరికీ ఇందిర గిరి, జల వికాసం ద్వారా ఉచితంగా బోర్లు, పంపుసెట్లు, సోలార్ విద్యుత్, పామాయిల్, అవకాడో మొక్కలను అందజేస్తామన్నారు. ఐదేండ్ల కాలంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకెళ్తుందన్నారు. ఈ ఏడాది రూ. 21 వేల కోట్లు వడ్డీ లేని రుణాలను మహిళా సంఘాలకు అందజేయడం జరిగిందన్నారు. తెల్ల రేషన్ కార్డులు ఉన్న వారందరికీ రూ. 10 లక్షల వరకు రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం ఉచిత వైద్యం అందిస్తామన్నారు. తెల్ల రేషన్ కార్డు ఉన్న వారికి 100 రోజుల పనిదినాలు కల్పిస్తున్నామని, యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ రెసిడెన్షియల్ ప్రారంభించి భవిష్యత్తు తరాన్ని ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దనున్నామని ఆయన తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగాల కల్పన జరుగుతుందని అదే సమయంలో రాజీవ్ యువ వికాసం ద్వారా తొమ్మిది వేల కోట్లతో పథకాన్ని ప్రారంభించామని జూన్ రెండున మంజూరు పత్రాలు అందజేస్తామన్నారు. ఆయన వెంట వైరా శాసన సభ్యులు మాలోత్ రాందాస్ నాయక్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, ట్రాన్స్‌కో ఎస్ఈ శ్రీనివాసాచారి, డిఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ కళావతి బాయి, డిసిహెచ్ఎస్ డాక్టర్ రాజశేఖర్, ఖమ్మం ఆర్డివో జి. నర్సింహారావు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# సంపద పంచుడు సరే.. సంక్షేమ పథకాలు అందించండి




(మొదటిపేజీ తరువాయి)

కనిపిస్తుందన్నారు. గత ప్రభుత్వంలో సంక్షేమ పథకాల అమలు ఇతరత్రా వ్యవహారాల్లో రాజకీయ జోక్యం పెరిగిందని ప్రజలు గ్రహించి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గెలిపించారని ప్రజల ఆశలకు అనుగుణంగా పాలన చేయాల్సిన అవసరం ఈ ప్రభుత్వంపై ఉందన్నారు. ఇందిరమ్మ ఇండ్లను అధికార పార్టీ నాయకులకే ఇండ్లను కేటాయించడం ఏ మేరకు సమాంజసమని ఆయన ప్రశ్నించారు. పట్టణంలో అనేక ఏళ్లుగా రెక్కల కష్టంపై ఆధారపడి జీవిస్తున్న పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు కేటాయించాలన్నారు. పదేళ్లుగా పింఛన్‌కు, కొత్త రేషన్ కార్డులకు ప్రజలు నోచుకోలేదని వెంటనే అర్హులైన పేదలందరికీ పింఛన్లు, రేషన్ కార్డులు అందించాలని సురేష్ డిమాండ్ చేశారు. రెండు దశాబ్దాలుగా పట్టణీకరణ వేగం పుంజుకుందని వ్యవసాయ రంగ సంక్షోభం కారణంగా ప్రజలు జీవనాధారం కోసం పట్టణాలకు వచ్చారని దీనితో మౌలిక వసతుల కల్పన జరగాల్సి ఉందన్నారు. ఖమ్మం కార్పోరేషన్‌కు సంబంధించి విలీన గ్రామ పంచాయతీల్లో అభివృద్ధికి నోచుకోవడం లేదని పలు సమస్యలు అపరిష్కృతంగా ఉన్నాయని సురేష్ తెలిపారు. అపరిష్కృత సమస్యలను పరిష్కారించాలని డిమాండ్ చేస్తూ సిపిఐ ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని గతంలో పలు మార్లు వినతి పత్రాలు సమర్పించామని అయిన ఫలితం లేకపోవడంతో కార్యాలయ ముట్టడికి నగర సమితి ఆధ్వర్యంలో పిలుపునిచ్చినట్లు ఆయన తెలిపారు. నగరంలో నివసిస్తున్న పేదల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయడంతో పాటు సంక్షేమ పథకాల అమలును వివక్షకు తావులేనివిధంగా పేదలకు అందించేందుకు ప్రయత్నం చేయాలన్నారు. పింఛన్లు, ఇందిరమ్మ ఇండ్లు, కొత్త రేషన్ కార్డులు అందించకపోతే ఆందోళనను తీవ్రతరం చేస్తామని ఆయన హెచ్చరించారు. ప్రభుత్వం ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. గ్రామీణ, పట్టణ పేదల నుంచి ప్రజా పాలనలో



తీసుకున్న దరఖాస్తులకు ఇంత వరకు మోక్షం కలుగలేదని సురేష్ ఆరోపించారు. దరఖాస్తులను సరైన రీతిలో గుర్తించక మరోసారి దరఖాస్తులు కోరారని అయిన పేదలకు ఫలితం దక్కలేదన్నారు. అద్దెలు భారంగా మారి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న పరిస్థితుల్లో నివాస స్థలాలు, ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని సురేష్ తెలిపారు. వితంతువు, వృద్ధాప్య, దివ్యాంగుల పెన్షన్లు పెంచుతామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోని పక్షంలో ఈ ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించక తప్పదని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నగర కార్యదర్శి ఎస్‌కె జానిమియా, జిల్లా కార్యవర్గ సభ్యులు యర్రా బాబు, శింగు నర్సింహారావు, పోటు కళావతి, బిజి క్లెమెంట్, మహ్మద్ సలాం, తోట రామాంజనేయులు, మేకల శ్రీనివాసరావు, నగర సహాయ కార్యదర్శులు పగడాల మల్లేష్, యానాలి సాంబశివరెడ్డి, జిల్లా సమితి సభ్యులు బండి సత్యం, గాదె లక్ష్మి నారాయణ, నూనె శశిధర్, ఏనుగు గాంధీ, వరదా నర్సింహారావు, ఖాదర్‌బాబా, పీట్ల కృష్ణమూర్తి, యాకూబ్, నానబాల రామకృష్ణ, శ్రావణ్, బోడా వీరన్న, చానా, జాకీర్, జ్వాలా నర్సింహారావు, రవీంధర్, మాడుగుల నాగేశ్వరరావు, మాలకొండయ్య తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులు పది కాలాల పాటు ఉండేలా నాణ్యతతో చేపట్టాలి

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** అభివృద్ధి పనులు పది కాలాల పాటు ఉండేలా నాణ్యతతో చేపట్టాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. బుధవారం రఘునాథపాలెం మండలం చింతగుర్తి గ్రామం ఎస్సి కాలనీలో సిఆర్ఆర్ (ఎస్‌సిపి) నిధులతో రూ. 40 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న అంతర్గత సిసి రోడ్లు, డ్రైన్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రఘునాథపాలెం మండలంలో అభివృద్ధి పనులను క్రమ పద్దతిలో చేపట్టామని తెలిపారు. సిసి రోడ్లు, డ్రైన్ నిర్మాణ పనులను వర్షాకాలం లోగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకు రావాలన్నారు. ప్రస్తుతం చేసే పనులు పదికాలాల పాటు ఉండేలా నాణ్యతతో ఉండేలా పూర్తి చేయాలన్నారు. మన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పారిశుధ్యం పాటిస్తేనే మన ఆరోగ్యం బాగుంటుందని తెలిపారు. రైతులు పంట మార్పిడి విధానం అమలు చేయాలని ఆయిల్ పాం లాంటి లాభసాటి పంటలను సాగు చేయాలని తెలిపారు. విద్య, వైద్య రంగాలకు ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తూ అభివృద్ధి పనులు చేపట్టిందని ఆయన తెలిపారు. రఘునాథపాలెం మండలంలో వైద్య కళాశాల, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మిస్తున్నామని ఆదర్శ మండలంగా దీనిని అభివృద్ధి చేసేందుకు అన్ని చర్యలు పకడ్బందీగా చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, ఏఎంసి ఛైర్మన్ యరగర్ల హన్మంతరావు, ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## మొదలైన కార్పోరేట్ చదువుల దోపిడీ..!

(మొదటిపేజీ తరువాయి)


(ఫైల్)

వల విసురుతున్న విద్యాలయాలు ఎడాది తిరిగే లోపు అ ఫీజు ఈ ఫీజు అంటూ, పుస్తకాలు, మెటీరియల్, స్పెషల్ డిజిటల్ వర్క్‌బుక్స్, తదితరాల పేరుతో లక్షలు గుంజేస్తున్నారు. సం. జేబుకు చిల్లు పడిన సంగతి సంవత్సరం గడిచాక గానీ అర్థం కావడం లేదు. జిల్లా వ్యాప్తంగా సుమారు 50కి పైగా జూనియర్ కాలేజీలు, 100కి పైగా స్కూళ్లు ఉన్నాయి. ఆయా స్కూళ్ల పరిధిలో ఎవరి దోపిడీ వారిదే. ఇందులో ఎలాంటి సందేహం లేదు. మాస్టాండర్డ్‌ను బట్టి ఫీజులు వసూళ్లు చేస్తామంటూ యాజమాన్యాలే చెప్పుకొస్తుండటం విశేషం. కార్పోరేట్ స్థాయి చదువుల పేరుతో పేకమేడల్లాంటి గదుల్లో గాలివెలుతురు లేకుండా విద్యాబోధన చేస్తున్నారు. విశాలమైన తరగతి గదులకు బదులు ఇరుక్కొని కూర్చునే పరిస్థితి ఎర్పడింది. ప్రథామిక విద్యార్థులకు బోధించినట్లు ప్రక్కప్రక్కనే తరగతు గదులు ఉంటున్నాయి. జిల్లాలో కొన్ని బడుల్లో 8,9,10 తరగతులకు అన్ని రకాల ఫీజులు, పుస్తకాలు, ఇతరత్రా కలిపి ఏడాదికి రూ.1లక్ష నుండి రూ.1లక్ష 20 వేల వరకు ఖర్చు వస్తున్నట్లు తల్లిదండ్రులు వాపోతున్నారు. మరికొన్నిట్లో సుమారు రూ.50వేలుతో సరిపెడుతున్నారు. ఆయా పాఠశాలలు చేసే హంగామా, గదుల నిర్వహణ, బస్సులు, హడావిడి తదతరాలపై ఫీజులు ఆధారపడి ఉంటున్నాయి. ఇక ఇంటర్ కాలేజీల్లో అయితే ఈ దోపిడీ మాములుగా ఉండదు. అడ్వాన్స్‌డ్ పేరుతో వేసవి సెలవుల్లో సైతం తరగతులు జరుగుతున్నాయి. ఇంటర్ ఎంపిసి, బైపిసి గ్రూపలకు డిమాండ్ ఉండటంతో కార్పోరేట్ కాలేజీలు పెద్ద ఎత్తున ఫీజులు దండుకుంటున్నాయి. జెఇఇ మెయిన్స్, ట్,ఎంసెట్,ఇఎపిసెట్ లలో ప్రత్యేక శిక్షణ పేరుతో, ఏసి, నాన్ ఏసి తరగతి గదులు ఏర్పాటు చేసి ధరలు నిర్ణయించి లక్షల్లో దోచుకుంటున్నారు. ఈ ఫీజుల వ్యవహారంలో నియంత్రణ లేకపోవడం, పర్యవేక్షణ కొరవడటంతో ఎవరి ఇష్టాను సారంగా వారు దండుకుంటున్నారు.

### ఫీజు రీయంబర్స్‌మెంట్ రాక...

ఫీజు రీయింబర్స్మెంట్ అవకాశం ఉందని కళాశాల్లో చేర్పించిన తల్లిదండ్రులకు చుక్కలు కనిపిస్తున్నాయి. గత మూడేళ్లుగా ఫీజులు రాక పోవడంతో ఇంటర్‌పాసైన విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇచ్చే విషయంలో యాజమాన్యాలు ఫీజులు కట్టి తీసుకెళ్లాల్సిందే అంటూ కొర్రీలు పెడుతున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వం నుండి ఫీజు రాంగానే మీకు రావాల్సింది మీఖాతాలోకే వస్తాయంటూ చెబుతున్నట్లు తెలుస్తోంది. దీంతో చేసేది ఏమీ లేక అప్పుసప్పులు చేసి ఒప్పుకున్నంత ఫీజు చెల్లించి సర్టిఫికెట్లు తీసుకునేందుకు సిద్ధపడుతున్నట్లు సమాచారం.

### అర్హతలేని వారితో...

ప్రైవేటు, బడులు, కాలేజీల్లో అర్హత లేని వారితో చదువులు చెప్పిస్తూ పబ్బంగడుపుతున్నట్లు తెలుస్తోంది. హైస్కూల్ విద్యార్థులకు బోధన చేయాలంటే బిఇడి, ప్రైమరీ స్కూళ్లకు చెప్పాలంటే డిఇడి, కాలేజీల్లో బోధించాలంటే పిజి, ఎంఇడి ఉండాలి. కానీ ప్రస్తుతం కాలేజీలు, స్కూళ్లలో ఈ పరిస్థితి లేదు. పదో తరగతి వారికి కూడా కేవలం డిగ్రీ అయిన వారితోనే చదువులు కానిచ్చేస్తున్నారు. ఇంటర్ చెప్పే వారికి పిజి చదివిన వారు బోధన చేస్తున్నారు. కనీస విద్యానిబంధనలు పాటించకుండా బోధనలు సాగిస్తూ వేలు, లక్షల్లో ఫీజులు కాజేస్తూ అరకొర జీతాలు ఇస్తున్నట్లు తెలుస్తోంది.

### ప్రభుత్వ నిబంధనలు అమలయ్యేనా...

ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కాలేజీల్లో ఫీజుల నియంత్రణకు ప్రభుత్వం ముందుకు వచ్చినప్పటికీ ఆదిశగా అడుగులు పడేనా అనే అనుమానాలు పలువురువ్యక్తం చేస్తున్నారు. ప్రతీబడిలో పేదలకు 25 శాతం ఉచిత సీట్లు, రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో పేరెంట్స్ కమిటీల ఏర్పాట్లు, ఇంజనీరింగ్ కాలేజీల తరహాలో ఫీజుల నియంత్రణ వంటి అంశాలపై ప్రభుత్వం కసరత్తు చేస్తూ ముసాయిదా చట్టం సిద్ధం చేసింది. అయితే దీనిపై ఇప్పటికే మంత్రి శ్రీధర్ బాబు అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ప్రైవేటు యాజమాన్యాలు హాజరై తలూపినప్పటికీ వారు లేవనెత్తిన సందేహాలపై మరో సమావేశంలో చర్చించి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని చెప్పుకొచ్చారు. కాగా ఈ ముసాయిదా తీర్మాణం అమలలైతే మేలని, దీనిపై మోకాలు అడ్డేందుకు ప్రైవేటు యాజమాన్యాలు న్యాయస్థానాలను ఆశ్రయించే అవకాశం లేకపోలేదని పలువురు విద్యావిశ్లేషకులు అంటున్నారు.

# నిరంతరం పేదల పక్షాన పోరాడేది సిపిఐ



## సీపీఐ జాతీయ సమితి సభ్యులు బాగం

**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** నిరంతరం ప్రజల పక్షాన నిలబడి పోరాటం చేసేది భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) అని, వందేళ్ల చరిత్ర కలిగిన పార్టీ అని సీపీఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంత రావు పేర్కొన్నారు. బుధవారం నేలకొండపల్లి మండల సీపీఐ కౌన్సిల్ సమావేశం ను మండల కేంద్రము లోని కర్నాటి కృష్ణయ్య భవనం వద్ద నిర్వహించారు. ఈ సమావేశం కు రైతు సంఘం మండల కార్యదర్శి పాల్తియ శ్రీనివాస్ అద్యక్షతన ముఖ్య అతిథిగా భాగం హేమంత రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చి 11 సంవత్సరాలు గడుస్తున్న పేద ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. నరేంద్ర మోడీ పరిపాలనలో కార్పొరేట్ శక్తులకు పెట్టుబడిదారులకు మేలు కలిగించే విధానాలకు పాల్పడుతుందన్నారు. కేందఠ్రంలోని బిజెపి ప్రభుత్వం మతవిద్వేషాలను రెచ్చగొడుతూ కులాలు, మతాల మధ్య చిచ్చు పెడుతూ రాజకీయ పబ్బం గడుపుతుందని విమర్శించారు. రాష్ట్రంలో సీపిఐ సహకారంతో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని, ఎన్నికల కు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలన్నిటిని అమలుపరచాల్సిన బాధ్యత రేవంత్ రెడ్డి సర్కార్ పై ఉందన్నారు. సంక్షేమ పథకాలు అమలులో అర్హులైన పేదలకు ఇండ్లు, ఇళ్ల స్థలాలు, సంక్షేమ పథకాలు అందించాలన్నారు. పూర్తిస్థాయిలో రుణమాఫీ చేసి, భూ సమస్యలు పరిష్కరించాలని కోరారు. వందేళ్ళ చరిత్ర కలిగిన ఏకైక పార్టీ భారత్ కమ్యూనిస్ట్ పార్టీ అన్నారు. ఉద్యమాలతోనే పార్టీకి గుర్తింపు వస్తుందన్నారు. అధికారంలో ఉన్నా లేకున్నా ప్రజల పక్షాన ఉండి పోరాటాలు నిర్వహిస్తూ ప్రజల సమస్యలపై బలమైన ఉద్యమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. మండలంలో పార్టీని బలోపేతం చేయడం కోసం శక్తివంచన లేకుండా కృషి చేయాలన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీని బలోపేతం చేయడంతో పాటు సర్పంచులుగా ఎంపీటీసీగా పోటీ చేసేందుకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. పార్టీ గ్రామ శాఖలు, ప్రజా సంఘాలను ఏర్పాటు చేసుకొని మండల మహాసభ నిర్వహించుకొని సిద్ధంగా ఉండాలని పేర్కొన్నారు ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కర్నాటి భాను ప్రసాద్, జిల్లా కౌన్సిల్ సభ్యులు కనకబండి సీతారాములు, సీపీఐ మండల సహాయ కార్యదర్శి మారిశెట్టి వేంకటేశ్వరరావు, ఏఐవైఎఫ్ ఖమ్మం జిల్లా సహాయ కార్యదర్శి మల్లెబోయిన ఉపేందర్, మండల కౌన్సిల్ సభ్యులు కర్నాటి నళిని రాణి, భాగం నరసింహారావు,రాయల మాదవ్, కాశ బోయిన అయోధ్య, మేకల పుల్లయ్య, అనంత పుల్లయ్య, యలగాల నరసరావు, నంబూరి నారాయణ, తమ్మిశెట్టి మమత, శ్రీమతి, పాలపాటి అశోక్, ఆలేటి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# నర్సింహారావు సేవలు మరువలేనివి



**ప్రజాపక్షం/ఖమ్మం :** మోటమర్రి మాజీ ఎంపిటిసి, సిపిఐ నాయకులు మరీదు నర్సింహారావు సేవలు మరువలేనివని సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు కొనియాడారు. మండలంలోని మోటమర్రి గ్రామంలో నరసింహారావు 5వ వర్ధంతి సభను మంగళవారం సాయంత్రం నిర్వహించారు. ముందుగా నర్సింహారావు స్మారక స్థూపానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆనందరావు మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ నాయకునిగా, ఎంపిటిసిగా మోటమర్రి గ్రామానికి నరసింహారావు విశేష సేవలు అందించారని అన్నారు. నర్సింహారావు నిబద్ధత కలిగిన కమ్యూనిస్టు నాయకునిగా, నీతికి, నిజాయితీ మారుపేరుగా నిలిచారని అన్నారు. కమ్యూనిస్టు పార్టీ కార్యక్రమాన్ని తూచా తప్పకుండా అమలు చేసే వారిలో నర్సింహారావు ముందు వరుసలో ఉంటారని ఆయన తెలిపారు. నర్సింహారావు మృతి అట్టడుగు వర్గాలకు తీరని నష్టం కలిగించిందన్నారు. మోటమర్రి గ్రామాభివృద్ధికి ఆయన చేసిన కృషి ప్రసంసనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యవర్గ సభ్యులు బుర్రి నాగేశ్వర రావు, శాఖ కార్యదర్శి వంగాల కృష్ణ, మండల నాయకులు మరీదు మల్లయ్య, మరీదు నాగేశ్వర రావు, నాయుడు రంగమ్మ, సోసైటి డైరక్టర్ మరీదు శ్రీనివాసరావు, నర్సింహారావు కుటుంబసభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# భూ భారతిలో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

**ప్రజాపక్షం/ఖమ్మం :** భూ భారతిలో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని తహసీల్దార్లు అనిశెట్టి పున్నం చందర్, రాంబాబులు తెలిపారు. బుధవారం ముష్టికుంట్ల, బ్రాహ్మణపల్లి గ్రామాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహించి, భూ సమస్యలకు సంబంధించి రైతుల నుంచి ధరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు తమ భూముల విషయంలో ఉన్న అభద్రత భావాన్ని తావు నీయకుండా జవాబుదారుతనాన్ని పెంచేందుకు భూ భారతి చట్టాన్ని చేపట్టడం జరిగిందని అన్నారు. కొత్త చట్టం ద్వారా లావాదేవీలు సేవలు, రిజిస్ట్రేషన్, ముటేషన్, నిషేధిత భూములు, ఆర్ఓఆర్ మార్పులు చేర్పులు వంటి సేవలు సులభతరం అవుతాయని తెలిపారు. రైతులకు, అధికారులకు సులభంగా అర్థం అయ్యేలా సామాన్య, గ్రామీణ ప్రజల, రైతుల సమస్యలు పరిష్కారం అయ్యేలా భూ భారతి చట్టం ఉందన్నారు. హక్కుల రికార్డులలో తప్పుల సవరణకు భూభారతిలో అవకాశం ఉందన్నారు. పెండింగ్ సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారం లభిస్తుందన్నారు. భూమి హక్కుల ఏ విధంగా సంక్రమించిన మ్యుటేషన్ చేసి రికార్డులలో నమోదు చేయవచ్చని అన్నారు. భూ సమస్యల పరిష్కారానికి భూ భారతి చట్టంలో రెండు అంచెల అప్పీల్ వ్యవస్థ ఉందని తెలిపారు. భూధార్ కార్డుల జారీ జరుగుతుందని అన్నారు. రైతులకు ఉచిత న్యాయ సహాయం లభిస్తుందని తెలిపారు. గ్రామ రెవెన్యూ రికార్డుల నిర్వహణ ఉంటుందని, మోసపూరితంగా హక్కుల రికార్డుల మార్చి,



ఎవరైనా ప్రభుత్వ, భూదాన్, అసైన్డ్, ఎండోమెంట్, వక్ఫ్ భూములకు పట్టాలు పొందితే రద్దు చేసే అధికారం చట్టంలో ఉందన్నారు. హక్కుల రికార్డులో తప్పుల సవరణకు, భూమి హక్కులు ఉంది రికార్డులో లేని వారు హక్కుల రికార్డులో నమోదు చేయించుకోవడానికి కొత్త చట్టం వచ్చిన సంవత్సరం లోగా దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా ముష్టికుంట్ల గ్రామంలో చేపట్టిన రెవెన్యూ సదస్సులో భూ సమస్యలకు సంబంధించి 185, బ్రాహ్మణపల్లి గ్రామ రెవెన్యూ సదస్సులో 53 దరఖాస్తులను స్వీకరించారు. స్వీకరించిన దరఖాస్తులకు అధికారులు రశీదులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల ఆర్ఐలు నవీన్, మైథిలి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఆడపిల్ల ప్రతీ ఇంటా మణిదీపం

**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** ప్రతీ ఇంట్లో ఆడపిల్ల ఆ ఇంటి మణిదీపం అని జిల్లా ఇంటర్ విద్యాశాఖాధికారి, మండల స్పెషల్ ఆఫీసర్ కె.రవిబాబు అన్నారు. బుధవారం మండల కేంద్రమైన నేలకొండపల్లి లో మా ఇంటి మణిదీపం కార్యక్రమంలో భాగంగా ఆడ పిల్లలు పుట్టిన ఇళ్లకు వెళ్లి చినారులను ఆశ్వీరదించారు. పండుగ వాతావారణం మధ్యలో తల్లి దండ్రులను ఘనంగా సన్మానించారు. సర్టిఫికెట్ ను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు...ఆడ పిల్ల పుట్టిన దగ్గర నుంచి వారికి సరైనా అవగాహన కల్పిస్తే, అన్ని రంగాలలో ముందు వరసలో ఉంటారని అన్నారు. వారి కోసం ప్రభుత్వాలు అనేక పథకాలు ప్రవేశపెడుతున్నట్లు . పేర్కోన్నారు. ఆడ పిల్ల పుట్టటం ఓ వరం అన్నారు. ఆడ పిల్లల ను బతకినిదామని, తలి దండ్రులు అవగాహన పెంచుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలంలో ఐసీడీఎస్ ఏసీడీపీవో జె.రత్నకుమారి, ఎంపీడీఓ యం, యర్రయ్య, సూపర్వైజర్ నాగమణి, పంచాయతీ కార్యదర్శి అంగన్వాడీ టీచర్లు, ఆయా లు, తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



# విద్యుత్ షాక్‌కు మూగజీవి బలి



**ప్రజాపక్షం/ఖమ్మం:** మండల పరిధిలోని అంకంపాలెం పాఠశాల ఎదురుగా ట్రాన్స్‌ఫార్మర్ కిందకి ఉండటం వల్ల అదే గ్రామానికి చెందిన రైతు కోర్స పుల్లయ్య ఎద్దు మేత మేసుకుంటూ వెళ్ళి కరెంట్ షాక్ కు గురై మరణించడం జరిగింది. రైతు పుల్లయ్య సంఘటన స్థలానికి చేరుకొని విగతజీవిగా పడి ఉన్న ఎద్దుని చూసి ఆవేదన చెందుతూ, కన్నీటి పర్యంతమవడం గ్రామస్థులను కలచివేసింది. విద్యుత్ శాఖ అధికారులు స్పందించి, బాధిత రైతు ఎద్దుకు నష్ట పరిహారం వెంటనే చెల్లించి న్యాయం చేయాలని రైతులు, గ్రామస్థులు డిమాండ్ చేశారు. మరలా ఇటువంటి చర్యలు పునరావృతం కాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను గ్రామస్థులు, రైతులు, బాధిత కుటుంబ సభ్యులు కోరారు.

# ఆడపిల్ల ఇంటికి వెలుగు




**ప్రజాపక్షం/ తిరుమలాయపాలెం :** అమ్మాయి పుడితే ఇంటిల్లిపాదీ పండుగ చేసుకోవాలని, అదృష్టం ఉన్నవాళ్లకు మాత్రమే ఆడపిల్లలు పుడతారని తిరుమలాయపాలెం మండల స్పెషలాఫీసర్ ధనసరి పుల్లయ్య అన్నారు. తిరుమలాయపాలెం మండలంలోని మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో బుధవారం ఆడపిల్ల జన్మోత్సవ వేడుకలను కన్నుల పడుగగా ఘనంగా నిర్వహించారు. బచ్చోడు గ్రామానికి చెందిన తాటి కొండ భానుశ్రీ ఇటీవల ఆడ పిల్లకు జన్మనివ్వగా మండల ఆఫీసర్ పుల్లయ్య ఆమె ఇంటికి వెళ్లి మిఠాయి బాక్స్, పండ్లు, ధ్రువపత్రం, చిన్నారికి నూతన దుస్తులు అందించి శుభాకాంక్షలు తెలిపి శాలువాతో కుటుంబసభ్యులను సత్కరించారు. ఈ సందర్భంగా స్పెషలాఫీసర్ పుల్లయ్య మాట్లాడుతూ ఆడ పిల్లలు జన్మిస్తే తల్లిదండ్రులు భారంగా కాకుండా వరంలా భావించాలని అన్నారు. ఆడపిల్ల పుట్టడం అదృష్టమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ ఎస్కె సిలార్‌సాహెబ్, ఎఓ సీతారామిరడెడ్డి, సిడిపిఓ ఉదయశ్రీ, సూపర్వైజర్లు లక్ష్మీ , ఎఇఓ రమేష్, అంగన్వాడీ టీచర్లు లింగమ్మ, సుజాత, సత్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

# సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ




**ప్రజాపక్షం/ మధిర :** డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క సిఫార్సుతో మంజూరైన సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్ధిదారులకు బుధవారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పంపిణీ చేశారు. మండల పరిధిలోని మధిర, నిధానపురం, రొంపిమళ్ళ, సిద్ధినేనిగూడెం, వంగవీడు, జిలుగుమాడు, దెందుకూరు గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు మంజూరైన రూ.6లక్షల విలువ గల చెక్కులను మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సూరంశెట్టి కిషోర్, పట్టణ అధ్యక్షులు మిరియల రమణగుప్తా చేతుల మీదుగా అందచేయటం జరిగింది. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వివిధ ఆసుపత్రుల్లో చికిత్స తీసుకుని ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్న అర్హులైన వారందరికీ డిప్యూటీ సిఎం, మధిర శాసనసభ్యులు భట్టివిక్రమార్క కృషితో చెక్కులు మంజూరు కాగా వాటిని లబ్ధిదారులకు అందచేయటం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మధిర మండల ఎస్సీసెల్ అధ్యక్షులు దారా బాలరాజు, నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు తూమాటి నవీన్‌రెడ్డి, అద్దంకి రవికుమార్, కర్నాటి రామారావు, షేక్.జహంగీర్, మాగం ప్రసాద్, కోట నాగరాజు, బండారు నర్సింహారావు, మెండెం వెంకన్న, ఓబుల లక్ష్మారెడ్డి, జింకల కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## ఆడ బిడ్డ ఇంటికి దీపం : కలెక్టర్



ప్రజాపక్షం/ ఖమ్మం : ఆడ బిడ్డ పుట్టడం ఎంతో అదృష్టంగా భావించాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. మా పాపా మా ఇంటి మణిదీపం కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని పెద్దగోపవరం గ్రామంలో మధిర ఐసిడిఎస్ సెక్టార్ పరిధిలో ఎసిడిపిఓ కృష్ణశ్రీ ఆధ్వర్యంలో సిబ్బంది కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో ముఖ్యఅతిధిగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ పాల్గొన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఆడ పిల్ల అంటే సమాజంలో అన్ని రంగాల్లో పనిచేసే విధంగా తల్లిదండ్రులు చూడాలన్నారు. ఆడ బిడ్డ పుడితే ఇంటికి బంగారమని అన్నారు. ఈరోజు ఆడపిల్లలు అన్ని రంగాల్లో తమ శక్తి సామర్థ్యాలతో దూసుకుపోతున్నారని తెలిపారు. మగ పిల్లలతో సమానంగా ఆడ పిల్లలను కూడా చదివించి ఉన్నతస్థాయికి ఎదిగేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. పెద్ద గోపారం గ్రామానికి చెందిన గూడరి కోటేశ్వరి లక్ష్మి నారాయణరెడ్డిలకు ఆడబిడ్డ పుట్టగా కుటుంబ సభ్యులను కలెక్టర్ చేతుల మీదుగా స్విట్ బాక్స్, పండ్లు శాలువాతో సన్మానించి ప్రశంసాపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెల్ఫేర్ ఆఫీసర్ రామ్‌గోపాల్‌రెడ్డి, డిఎంఅండ్‌హెచ్‌ఓ కళావతిభాయి, ఎంపిడిఓ సురేందర్,ఐసిడిఎస్ ఎసిడిఓ కృష్ణశ్రీ, సూసర్వైజర్లు టి.సరిత, మధులత, సునీత, అంగన్వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

## చక్రాల కింద నలుగుతున్న రెండు పదుల జీవితాలు..!



(ఫైల్)

ప్రజాపక్షం/ఖమ్మం : ఇటీవల కాలంలో మండలంలో జరిగినటువంటి ద్విచక్ర వాహన ప్రమాదాలలో మరణించిన వారు అందరూ కూడా 20 నుంచి 25 సంవత్సరాలు ఉన్న యువకులే. వీరంతా కూడా చిన్నపాటి నిర్లక్ష్యంతో నూరేళ్ల జీవితాన్ని మూల్యంగా చెల్లించారు. బైక్ నడపడంలో తామే గొప్పవారమని, హెల్మెట్ అవసరం లేదని అది పెట్టుకుంటే శిరోభారం అని భావించేవారు మనలో చాలామంది ఉన్నారు. హెల్మెట్ భారం కాదు అది మనకి ఒక రక్షణ కవచం అని చాలామందికి తెలిసినా అది మనం ధరించం. యువత బైక్ ఎక్కితే చాలు రైమని దూసుకుపోతుంటారు. చాలామంది ద్విచక్రవాహనదారులకు మితిమీరిన వేగంతో మద్యం మత్తులో వాహనాన్ని నడపటం, ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించడం పరిపాటిక మారిపోయింది. ద్విచక్ర వాహన ప్రయాణం ప్రమాదకరమైంది గా మారింది. ఇటీవల కాలంలో జరిగిన చాలా ప్రమాదాలు ఇందుకు నిదర్శనంగా ఉన్నాయి. దీనికి ప్రధాన కారణం వారి నిర్లక్ష్యం ఇటీవల యువత సెల్ఫోన్ డ్రైవింగ్ చేయడం నిర్లక్ష్యంగా హెల్మెట్ లేకుండా డ్రైవింగ్ చేస్తూ రహదారుల నియమ నిబంధనల మీద సరైన అవగాహన లేకపోవడంతో ప్రాణాలు కోల్పోతున్నారు. శరీరానికి తలకాయ ప్రధానం అలాంటి దాన్ని కాపాడుకోవాలి అంటే తప్పనిసరిగా మనం హెల్మెట్ ధరించాలి అని ట్రాఫిక్ రూల్స్ చెబుతున్నాయి. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో వేగానికి ఇచ్చే ప్రాధాన్యత మనం మన భద్రతకు ఇవ్వలేకపోవటంతో భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది తాజాగా జరిగినటువంటి ఒక సర్వేలో చాలా ప్రమాదాలలో హెల్మెట్ పెట్టుకో పోవటం వలన వాహనదారులు తమ ప్రాణాలను కోల్పోతున్నారని ప్రభుత్వ లెక్కలు చెబుతున్నాయి. పోలీస్‌లు ద్విచక్ర వాహనదారులను హెల్మెట్ వినియోగించే విధంగా చర్యలు తీసుకోని కఠినంగా వ్యవహరించాలని మేధావులు కోరుతున్నారు.

## విద్యార్థులకు స్పాట్ కౌన్సిలింగ్



ప్రజాపక్షం/ఖమ్మం : తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల కళాశాలలో మొదటి సంవత్సరం ప్రవేశాలకు ఖమ్మం, భద్రాద్రి రీజియన్ లోని విద్యార్థులకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు, ఇందులో గిరిజన సంక్షేమ గురుకుల కళాశాల కిన్నెరసాని, సి.ఓ.ఈ. కిన్నెరసాని లో అడ్మిషన్ కొరకు అర్హులైన గిరిజన విద్యార్థులు హాజరు కావాలని కిన్నెరసాని గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ ఎస్. శ్యామ్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అంతే కాకుండా 2025 26 విద్యా సంవత్సరానికి గాను భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాలలోని గిరిజన సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరంలో(జూనియర్ ఇంటర్) సీట్ల భర్తీ కొరకు స్పాట్ కౌన్సిలింగ్ బాలికలకు, బాలురకు వేరు వేరుగా నిర్వహించనున్నట్లు ఆయన అన్నారు. కావున ఆసక్తి గల విధ్యార్థినీ విద్యార్థులు, ఇటీవలే పదవ తరగతి (202425 విద్యా సంవత్సరం) పూర్తయిన అభ్యర్థులు తప్పకుండా తమ ఒరిజినల్ సర్టిపికెట్లతో .తేది: 15052025 న ఉదయం 9.00 గంటలకు బాలికలకు, బాలురకు తేది:16052025 న ఉదయం 9.00 గంటలకు స్పాట్ కౌన్సెల్లింగ్ గిరిజన గురుకుల పాఠశాల/కళాశాల(బాలికలు), భద్రాచలం వద్ద స్పాట్ అడ్మిషన్ ప్రక్రియకు హాజరు కాగలరని కోరారు. ఈ సదావకాశాన్ని విద్యార్థినీ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని, మరిన్ని వివరాల కొరకు 9490957271. 9490957270 ఫోన్ నెంబర్లను సంప్రదించి తెలుసుకోవాలని ఆయన అన్నారు.

## నియోజకవర్గాభివృద్ధి.. ప్రజా సంక్షేమమే ధ్యేయం

**- రూ.2కోట్ల56 లక్షల అభివృద్ధి పనులకు ఎంఎల్ఏ కూనంనేని శంకుస్థాపన**



ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : నియోజకవర్గాభివృద్ధి, ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. బుధవారం పాల్వంచ మున్సిపాలిటీ పరిధిలోని మంచికంటినగర్, పాలకోయతండా, నవభారత్, జగ్గుతండా, గోవర్ధనగిరి కాలనీ, కొమ్ముగూడెం, గొల్లగూడెం, సీతారామపట్నం, ప్రియదర్శిని కాలనీలో ఆయన రూ.2 కోట్ల 56 లక్షల నిధులతో సిసి రోడ్లు, డ్రైన్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ ముందస్తు ప్రణాళికతో నియోజకవర్గాన్ని అన్ని విధాలు అభివృద్ధి పరిచేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. బస్తీలు, గ్రామాలాభివృద్ధికి నిధుల కేటాయింపులో వివక్షకు తావులేకుండా అభివృద్ధి చేసి తీరుతామన్నారు. అధికారులు పనుల పర్యవేక్షణలో బాధ్యతాయుతంగా ఉండాలని, నాణ్యతా ప్రమాణాల విషయంలో రాజీపడేది లేదన్నారు. గడిచిన ఏడాది కాలంలో మునుపెన్నడూ లేనివిధంగా అభివృద్ధి నిధులు మంజూరయ్యాయని, మున్సిపాలిటీ పరిధిలో అంతర్గత రోడ్లు, పారిశుధ్య సమస్యల పరిష్కారానికి పనులు వేగవంతంగా సాగుతున్నాయని చెప్పారు. పట్టణ ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారాన్ని చూపేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ కమీషనర్ సుజాత, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా, డిసిఎంఎస్ మాజీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, పట్టణ కార్యదర్శి అడుసుమిల్లి సాయిబబా, సహాయ కార్యదర్శి ఉప్పుశెట్టి రాహుల్, నాయకులు బండి నాగేశ్వరరావు, సుధాకర్, అన్నారపు వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు, వెంకట్రావు, చెరుకు శేఖర్, మన్నెం వెంకన్న, పల్లపు యాకయ్య, గౌస్, ఎస్ఏ రెహమాన్, కరీం, అహ్మద్ జానీ, కొత్తసురేష్, బిక్కులాల్, బివి సత్యనారాయణ, జకరయ్య, మాజీ సర్పంచ్ భూక్యా విజయ్ కుమార్, రాజశేఖర్, ఆదినారాయణ, రాజేష్, జిలానీ, శంకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## చెరువుల అభివృద్ధి శుభపరిణామం

**ఎమ్మెల్యే జారేకు గ్రామస్తుల కృతజ్ఞతలు**



ప్రజాపక్షం/ఖమ్మం : దమ్మపేట మండలం మొద్దులగూడెం గ్రామంలో ఇందిరమ్మ చెరువు బాట కార్యక్రమంలో భాగంగా ఎన్నో ఏళ్లుగా మరమ్మత్తులకు నోచుకోని సాగునీటి వనరుల అభివృద్ధి కార్యక్రమంలో గత నెలలో మొద్దులగూడెం పంచాయతీ లో గల పెద్ద చెరువు, చింతల చెరువు అలుగుల పుడికతీత పనులకు శంకుస్థాపన చేసి అలుగులను బాగు చేయించినందుకు మొద్దులగూడెం గ్రామ ప్రజలు, ఆ చెరువుల క్రింద సాగు చేసుకునే రైతుల తరుపున అశ్వారావుపేట శాసనసభ్యులు జారే ఆదినారాయణ కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మోరంపూడి వెంకటేశ్వరావు మాట్లాడుతూ చెరువుల మరమ్మతులు చాలా ముఖ్యమైనవి, సరైన నిర్వహణ లేకపోతే అవి క్షీణించిపోతాయి, కాలక్రమేణా చెరువుల్లో పేరుకుపోయిన మట్టి, ఒండ్రు, ఇతర వ్యర్థాలను తొలగించడం పూడికతీత ముఖ్య ఉద్దేశం, ఇది నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచుతుంది, గట్ల మరమ్మత్తు చెరువు గట్లు బలహీనపడటం, లేదా కోతకు గురైనప్పుడు వాటిని సరిచేయడం బలోపేతం చేయడం సంతోషకరమైన విషయం, తూములు, కాలువల మరమ్మత్తు నీటిని విడుదల చేయడానికి, సరఫరా చేయడానికి ఉపయోగించే తూములు, కాలువలు పాడైతే వాటిని బాగు చేయడం, మరమ్మతులు చేయటం శుభ పరిణామం అన్నారు. ఈ కార్యక్రమంలో యువ నాయకులు, శ్రీ ఏకులపోతమ్మ తల్లి గుడి చైర్మన్ దొడ్డ నరేష్, బొంతు రాజశేఖర్, గణపా రాము, రైతులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## వికసించిన 'మే పుష్పం'



ప్రజాపక్షం/ఖమ్మం : సంవత్సరంలో ఒకసారి మాత్రమే పూసే అది కూడా మే నెలలో మాత్రమే పూసే పుష్పమే మే పుష్పం (ఫుడ్ బాల్ లిల్లీ లేదా బ్లడ్ లిల్లీ) అంటారు. ఈ సంవత్సరం దమ్మపేట మండలం జగ్గారం పంచాయతీ లోని తాటి మల్లప్ప గుంపు గ్రామం లోని సోయం వెంకటేశ్వరరావు ఇంటి పెరట్లో సోమవారం వికసించింది. ఇంట్లో వారు వికసించిన పుష్పాన్ని చూసి మెరిసిపోవటంతో ఆనందానికి ఆశ్చర్యానికి లోనయ్యారు. వెంటనే మీడియా వారికి తెలియజేశారు. గ్రామంలో ఉన్న ప్రజలందరూ మే పుష్పాన్ని చూసి తమ సెల్ ఫోన్ లో బంధించడానికి బారులు తీరారు.

## సీలింగ్ భూమి ఆక్రమణ



ప్రజాపక్షం/ఖమ్మం : మండల పరిధిలోని గుండెపుడి రెవెన్యూ ప్రాంతం సర్వే నెంబర్ 117 సీలింగ్ భూమి ఆక్రమణలకు గురి అవుతుందని గ్రామీణ పేదల సంఘం, ఏరియా ఆదివాసీ నాయకులు బచ్చల లక్ష్మయ్య ఆరోపించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన, గిరిజనేతర పేదలు మనుగడ కోసం ప్రభుత్వ భూముల్లోకి వెళితే రెవెన్యూ, అటవీ శాఖ అధికారులు అడ్డుకొని, పలు విధాలుగా ఇబ్బందులకు గురి చేస్తుంటారని అన్నారు. కానీ కొందరు బడా బాబులకు మాత్రం ఆయా శాఖలకు చెందిన అధికారులు కొందరు వత్తాసు పలుకుతూ గుండెపుడి రెవెన్యూ సర్వే నెంబర్ 117లో కొంత సీలింగ్ భూమిని ఏజెన్సీ, గిరిజన ప్రాంత చట్టాలను ఉల్లంఘిస్తూ పథకం ప్రకారం ఒకరిద్దరు వ్యక్తుల పేరున అక్రమంగా పట్టాలు చేశారని ఆరోపించారు. అక్రమంగా సీలింగ్ భూములు కాజేసి, ఆ భూముల్లో పెద్ద ఎత్తున పైరవీలు చేసి, పరపతి ఉపయోగించి బినామీల పేరుతో అక్రమ మార్గాన మైనింగ్ అనుమతులు తీసుకొచ్చారని, అంతే కాకుండా గత రెండు నెలల కాలంగా కాజేసిన సీలింగ్ భూమిలో పెద్ద ఎత్తున యంత్రాలతో గుట్టలను తవ్వుతున్నారని ఆరోపించారు. టిప్పర్లతో రాత్రింబవల్లు మట్టిని దూర ప్రాంతాలకు తరలిస్తూ లక్షల రూపాయలు అక్రమ ధనార్జనకు పాల్పడుతున్నారని అన్నారు. కొంత మంది ముఠాగా తయారై ధనార్జనే ధ్యేయంగా మట్టి మాఫియా దందా చేస్తున్నారని, ప్రభుత్వ ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపితే సీలింగ్ భూమిని పట్టా చేసిన విషయం తేట తెల్లమవుతోందన్నారు. సీలింగ్ భూమి ఆక్రమణ, నిబంధనలకు విరుద్ధంగా పట్టాలు చేయడం, గుట్టలను తవ్వి ప్రకృతిని విధ్వంసం చేయడం వంటి అక్రమాలపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఈవిషయంపై జిల్లా కలెక్టర్, ఐటిడిఏ ప్రాజెక్ట్ ఆఫీసర్, జిల్లా మైనింగ్ అధికారి, కొత్తగూడెం రెవెన్యూ డివిజన్ ఆఫీసర్‌కి కూడా లిఖిత పూర్వకంగా సమగ్ర విచారణ కోసం విజ్ఞప్తి చేయడం జరిగిందన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఏజెన్సీ ప్రాంతంలో చట్టాలకు విరుద్ధంగా సీలింగ్ భూములను ఆక్రమించి, మైనింగ్ మాఫియాకు పాల్పడుతున్న వ్యక్తులపై శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## తనిఖీలు శూన్యం.. ఆర్ఎంపీల ఇష్టారాజ్యం..!

**-యథేచ్ఛగా అర్హత లేకున్నా వైద్యం చేస్తున్న వైనం**
**-ప్రజారోగ్య వ్యవస్థకు తూట్లు**
**-శంకర్‌దాదా ఎంబిబిఎస్‌పై చర్యలేవి**





ప్రజాపక్షం/బోనకల్: మండలంలోని ఆర్ఎంపీలు నిబంధనలకు విరుద్ధంగా ఆసుపత్రులు ఏర్పాటు చేసి రోగులకు వివిధ రకాల వచ్చి రాని వైద్యం చేస్తున్నా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ పట్టించుకోవడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రోగులకు తామే నిపుణులైన వైద్యులుగా మెరుగైన వైద్య సేవలందిస్తున్నట్లుగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యసేవలు శూన్యమంటూ విమర్శలు చేస్తూ పబ్బం గడుపుకుంటున్నారు. ఆర్ఎంపీలు కేవలం ప్రథమ చికిత్స కేంద్రాలు మాత్రమే నిర్వహించాలి. కొందరు ఆర్ఎంపీలు మాత్రం తమకు ఉన్న రాజకీయ పలుకుబడిని ఉపయోగించుకొని ఎంబిబిఎస్ వైద్యుల తరహాలో రోగులకు మందులు రాస్తూ.. వైద్య సేవలందిస్తుండటం గమనార్హం.

**-నిబంధనలకు విరుద్ధంగా వైద్యసేవలు...**

మండల వ్యాప్తంగా 100 వరకు ఆర్ఎంపీల ఆసుపత్రులు కొనసాగుతున్నాయి. కొందరు మాత్రం ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా రోగులను పరీక్షలు రాసి విచ్చలవిడిగా సూది మందులు, ఫ్లూయిడ్స్, యాంటిబయోటిక్స్, స్టెరాయిడ్స్, షెడ్యూల్ హెచ్ డ్రగ్స్, నార్కోటిక్ డ్రగ్స్‌లు ఇస్తున్నారు. కొంతమంది ఆర్ఎంపీలు ఏకంగా రక్త, మూత్ర పరీక్షల ల్యాబ్‌లను సైతం నిర్వహిస్తూ హైడోస్ యాంటీబయోటిక్స్ ఇంజెక్షన్‌లను ఇస్తున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి అనుకొని శాలె గోపి ఆర్ఎంపీ ఇరవై యేళ్లుగా ఆదిత్య హాస్పటల్ పేరుతో మెడికల్ షాపు, బెడ్స్, ఐవిస్టాండ్‌లు, మత్తుమందులు, సర్జరీ వస్తువులు, రక్తపరీక్ష కేంద్రం ఏర్పాటు చేసి డాక్టర్‌గా చలామణి అవుతూ ఫైల్స్ సర్జరీలు, సున్తీలు, అబర్షన్‌లు, మోకాళ్లలలో ఇంజెక్షన్‌లు, నరాల బలహీనత, సెక్స్ ఇతర జబ్బులకు ఆయుర్వేద, యునాని, అల్లోపతి, పంచకర్మ, ప్రకృతి వైద్యం అంటూ ప్రజల నుంచి సొమ్ము చేసుకుంటున్నాడు. హాస్పటల్ ఏర్పాటు చేసి వైద్యం చేస్తూ స్థానిక పిహెచ్‌సిలో పనిచేసే వైద్యులపై అవాకులు, చెవాకులు పెలుతూ ప్రభుత్వ ప్రజారోగ్య వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నాడు. ఈ ఆర్ఎంపీ సమీప కాలం చెల్లెందుకు దగ్గర ఉన్న నాసిరకం మందులను రోగులకు అంటగడుతూ జబ్బును తీవ్రతరం చేసి కార్పోరేట్ హాస్పటల్స్‌కి పంపి సొమ్ము చేసుకుంటున్న సంఘటనలు ఉన్నాయి. గత యేడాది మండలంలోని ఆర్ఎంపీ గోపి చేసిన వైద్యం వికటించి రోగులు మృతి చెందిన ఘటనలున్నాయి. ఇదే ఆర్ఎంపీ మందు మాన్పడానికి ఐరన్ కాప్యుల్స్‌లోని పొడిని ఇచ్చి వారానికి ఒకసారి అన్నంలో కలిపిపెట్టాలని అమాయకుల వద్ద వేల రూపాయలు దండుకొన్న సంఘటనలు ఉన్నాయి. గర్భిణీల వద్ద లింగ నిర్ధారణ పరీక్షలు చేయిస్తానని తప్పుడు రిపోర్ట్‌లను అంటగట్టి వారిని మనోవేదన గురి చేసిన సంఘటన కొకొల్లలు ఉన్నాయి. హైబిపి పేషంట్లకు వయాగ్రా ట్యాబెట్లు విచ్చలవిడి ఇచ్చి ప్రాణాలను తీసిన ఘటనలు ఉన్నాయి. ఆయుర్వేద మందుల పేర్లతో ఆలోపతి మందులైన స్టెరాయిడ్స్‌ను, నార్కోటిక్స్ డ్రగ్స్‌ను ఐదారు సంవత్సరాలుగా రోగులకు అంటగడుతూ ప్రజారోగ్యం దెబ్బతిస్తున్న సంఘటన కొకొల్లలు ఉన్నాయి. వేల మంది బాధితులు ఆయుర్వేదం పేరుతో ఇచ్చిన మందులు ఉపయోగించి కిడ్నీ వ్యాధులు తెచ్చుకున్న దాఖలాలు ఉన్నాయి. జర్నలిస్టుల, ప్రభుత్వ అధికారుల, రాజకీయ నాయకుల తల్లిదండ్రులకు కూడా ఈ మందులు అంటగట్టిన సంఘటనలు గమనార్హం. ఎంతమంది ఫిర్యాదులు చేసినా ఫర్వాలేదని, కాసులతో మండల, జిల్లా ఔషధ, వైద్య, ఆరోగ్య అధికారులను కొనేశానని..తనను కానీ.. తన క్లినిక్ కానీ ఏవరు ఏమి చేయలేరని బహిరంగంగా ప్రగాల్భాలు పలకడంపై మండల ప్రజలు ముక్కున వేలు వేసుకుంటున్నారు. ఇప్పటికైనా ఆర్ఎంపీ గోపి, క్లినిక్‌పై చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.




**-పట్టించుకోని జిల్లా ఔషధ, వైద్యా ఆరోగ్యశాఖ అధికారులు...**

మండలంలోని కొందరు ఆర్ఎంపీలు, పిఎంపీలు యధేచ్ఛగా ప్రజారోగ్య వ్యవస్థకు తూట్లు పొడుస్తున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు నిమ్మకినీరెత్తినట్లు వ్యవహరిచడంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. కేవలం ప్రథమ చికిత్స మాత్రమే అందించాల్సి ఆర్ఎంపీలు ప్రజల అమాయకత్వాన్ని, మూఢనమ్మకాలను మరింతగా వారిలో నాటి అనారోగ్యపాలు చేస్తూ శారీరకంగా, మానసీకంగా మనోవేధనకు గురిచేస్తున్నారు. మండలంలో ఆర్ఎంపీలు, పిఎంపీలపై నిరంతరం పర్యవేక్షణ, తనిఖీలు చేపట్టి పరిధికి మించి వైద్యం చేస్తున్న వారిపై చర్యలు తీసుకువల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇప్పటికైనా జిల్లా ఔషధ, వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు ఆర్ఎంపీ శాలె గోపిపై కఠిన చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

**-డిస్ట్రిక్ మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ దృష్టికి తీసుకుపోతాం : వేముల స్రవంతి, పిహెచ్‌సి వైద్యాధికారిణి**



మండలంలో ఆర్ఎంపీలు నిబంధనలకు విరుద్ధంగా వైద్యసేవలు అందిస్తున్నారని మా దృష్టికి వచ్చింది. ఇటువంటి చర్యలు వల్ల ప్రజారోగ్యం దెబ్బతింటుంది. దీంతో ఆర్థికంగా, శారీరకంగా అన్ని విధాల నష్టపోతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఆర్ఎంపీలు, పిఎంపీలు వైద్యం చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవు. ఈ విషయాన్ని డిఎంఅండ్ హెచ్‌ఓ దృష్టికి తీసుకుపోతాం. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అదేశాలతో తదుపరి చర్యలు చేపడతాం.

## మిల్లర్ల దోపిడీపై రైతుల నిరసన



ప్రజాపక్షం/చంద్రుగొండ: మండల పరిధిలోని రావికంపాడు ధాన్యం కొనుగోలు కేంద్రంలో మిల్లర్ల నయాదందాపై రైతులు బుధవారం నిరసన చేపట్టారు. రావికంపాడు గ్రామంలో పది రోజుల క్రితం రైతుల ధాన్యాన్ని కాంటాలు వేసిన మిల్లర్లు క్వింటాళ్లకు ఐదు నుండి ఏడు కేజీల తరుగు ఇవ్వాలని డిమాండ్ చేస్తుండటంతో నేటికి ధాన్యం ఎగుమతి కాకపోవడాన్ని నిరశిస్తూ బుధవారం ధాన్యం కొనుగోలు కేంద్రంలో నిరసన చేపట్టారు. ఈసందర్భంగా రైతులు మాట్లాడుతూ పది రోజులకు పైబడి కాంటాలు పూర్తి అయిన బస్తాలను ఎందుకు ధాన్యం కొనుగోలు కేంద్రం నుండి ఎగుమతి అవ్వటం లేదో మాకు అర్థం కావడం లేదని, రైతులు అధికారులను అడిగితే తరుగు డబ్బులు ముందస్తుగా మిల్లర్లకు ఫోన్‌పే, ఇతర పద్ధతిలో చెల్లిస్తే వెంటనే ఎగుమతి, దిగుమతి అవుతాయని స్పష్టం చేస్తున్నారని వాపోయారు. మిల్లర్ల దోపిడిపై అధికారులకు తెలియజేసిన సొసైటీ సిబ్బంది, అధికార పార్టీ నేతల ఒత్తిడి వల్ల మాకు న్యాయం జరగటం లేదన్నారు. నిబంధనల ప్రకారం ధాన్యాన్ని ఆరబెట్టి, మిషన్లతో తూర్పార పెట్టి, బస్తాకు కాంటా 40.600కేజీలకు గాను అదనంగా కేజికి పైగా తూకం వేసిన ధాన్యం బస్తాలను కొర్రీలు పెట్టడం సరికాదన్నారు. వ్యవసాయ అధికారుల ధృవీకరణ తరువాతనే కాంటాలు వేస్తున్నారని, అయినా ఇంకా తరుగు పేరుతో దోపిడి చేయడం సరికాదన్నారు. తరుగు పేరుతో రైతులను నిలువుదోపిడి చేస్తున్న మిల్లర్లపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని, కాంటాలు వేసిన ధాన్యాన్ని భేషరతుగా మిల్లర్లు దిగుమతి చేసుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో రైతులు కూసాల శ్రీను, గిన్నె నాగిరెడ్డి, పెండ్యాల క్రిష్ణరావు, ఇనుముల వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

## వెంకయ్యకు ఘన నివాళి

**-దహన సంస్కారాలకు ఐదు వేల ఆర్థిక సాయం**



ప్రజాపక్షం/బూర్గంపాడు:మండల పరిధిలోని లక్ష్మి పురం గ్రామ పంచాయితీలో గల రాధారపు వెంకయ్య మృతి చెందారు. ఈవిషయం తెలిసి వారి నివాసానికి వెళ్లి వెంకయ్య పార్థివదేహాన్ని మాజీ జెడ్‌పిటిసి కామిరెడ్డి శ్రీలత, రామకొండారెడ్డి దంపతులు సందర్శించి పూలమాలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పి దహన సంస్కార ఖర్చులకు రూ 5వేలను అందజేశారు. నివాళులర్పించిన వారిలో బొల్లపల్లి వీరారెడ్డి, కటుకూరి ప్రదీప్, బోయిన నరేష్, వజీర్, ఓరికెళ్ళ రాములు, రాదారపు ప్రభాకర్, గ్రామ పెద్దలు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

## నాగభూషణంకు నివాళి



ప్రజాపక్షం/ఖమ్మం : మండల పరిధిలోని కాకర్ల గ్రామ పంచాయితీ చెందిన చలువాది నాగభూషణం అనారోగ్య కారణంతో మృతి చెందారు. కాగ బుధవారం ఈవిషయం తెలుసుకొన్న ఉమ్మడి ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు లేళ్ల వెంకట్‌రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మంగీలాల్, మాజీ ఎంపీటీసీ దుద్దుకూరి మధుసూదన్‌రావు, మాజీ కాకర్ల ఎంపీటీసీ పొన్నెకంటి సతీష్‌లు వారి ఇంటికి వెళ్లి భౌతికకాయానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా మృతుడు నాగభూషణం కుటుంబ సభ్యులను ఓదార్చారు. అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు, మండల నాయకులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి పేద వారికి ఇల్లు, నిర్మించి ఇవ్వడమే ఇందిరమ్మ ప్రభుత్వ లక్ష్యం



ప్రజాపక్షం/కారేపల్లి: రాష్ట్రంలో ఉన్న ప్రతి పేదవారు గౌరవంగా బ్రతికేలా ఉండేందుకు ప్రతి ఒక్కరికి ఇల్లు నిర్మించివ్వడమే ప్రభుత్వ లక్ష్యమని వైరా శాసన సభ్యులు మాళోత్ రాందాస్ నాయక్ అన్నారు. పైలట్ గ్రామ పంచాయితీ కొత్తతండా గ్రామ పంచాయితీలో మంజూరైనా ఇళ్ళకు బుధవారం శంకుస్థాపన చేసిన అనంతరం సభలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో గల అన్ని వర్గాల ప్రజల అభివృద్దే ధ్యేయంగా తమ ప్రభుత్వం పని చేస్తుందని, ఒకే దఫా రైతు ఋణమాఫీ చేసిన ఘనత తమదని, రాష్ట్రం ఆర్థిక స్థితి బాలేకున్న సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్టు తెలిపారు. అనంతరం 63 మందికి కళ్యాణ లక్ష్మి చెక్కులు, సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేశారు. ఈకార్యక్రమంలో పగడాల మంజుల, తలారి చంద్రప్రకాష్, బానోత్ రామ్మూర్తి, ఇమ్మడి తిరుపతిరావు, బానోత్ రాందాస్, దారావత్ భద్రు, గుగులోత్ భీముడు, సొసైటీ వైస్ ఛైర్మన్ దారావత్ మంగీలాల్, బానోత్ హిరలాల్, మేదరి టోనీ, అడ్డగోడా ఐలయ్య, దారావత్ వినోద్ నాయక్, వి గాంధీ, కిలారి అప్పారావు, లక్ష్మి , డి వెంకటేశ్వర్లు, హనీఫ్, భూక్యా సైదులు, చక్రం, రంజిత్, వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

## నాభిశిల ప్రతిష్ఠకు విరాళం అందజేత



ప్రజాపక్షం/ములకలపల్లి: మండల పరిధిలోని రాచన్నగూడెం పంచాయితీ పాత జన్నెలగూడెం గ్రామంలో గత మూడు రోజులుగా జరుగుతున్న నాభిశిల ప్రతిష్టలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు. ఈసందర్భంగా మాజీ జెడ్‌పిటిసి బత్తుల అంజి సౌజన్యంతో నాభిశిల ప్రతిష్టలో పాల్గొని రూ 10వేల విరాళం, రాచన్నగూడెం గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న హనుమాన్ గుడికి రూ 5వేల విరాళం అందజేశారు. అనంతరం కొత్త జిన్నెలగూడెం గ్రామంలో జరుగుతున్న సమ్మక్క సాలమ్మ జాతరలో పాల్గొని ఆశీస్సులు మజీ సర్పంచ్, ములకలపల్లి మండల కాంగ్రెస్ నాయకులు కారం సుధీర్‌కుమార్, సురభి రాజేష్, స్థానిక యువకులు పోడియం పండు, సోయం అఖిల్, కారం పండు, శివ, ఆలయ కమిటీ సభ్యులు తీసుకున్నారు. ఈకార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.

# మధిర నియోజకవర్గాన్ని మోడల్‌గా నిలుపుతాం

**-డిప్యూటీ సిఎం భట్టీ విక్రమార్క**





**ప్రజాపక్షం/ఖమ్మం :** అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో రాష్ట్రంలోనే మధిర నియోజవర్గాన్ని మోడల్‌గా నిలుపుతామని డిప్యూటీ సిఎం భట్టీ విక్రమార్క మల్లు అన్నారు. బుధవారం మండలంలోని కలకోట, రావినూతల గ్రామాలలో పలు అభివృద్ధి పనులకు ఆయన శంఖుస్థాపనలు చేశారు. ముందుగా కలకోట గ్రామంలో కలకోట నుండి మోటమర్రి వరకు రూ. 20 కోట్లతో వ్యయంతో చేపట్టనున్న రోడ్డు విస్తరణ పనులకు, రూ.10 లక్షల వ్యయంతో నిర్మించనున్న అంగన్వాడీ భవన నిర్మాణ పనులకు, దీంతో పాటు రూ. 12 లక్షలతో నిర్మించనున్న మత్స్య సంఘ భవన నిర్మాణ పనులకు శంఖుస్థాపన చేశారు. అనంతరం రావినూతల గ్రామంలో రూ. 2.80 కోట్ల వ్యయంతో రావినూతల నుండి ఆళ్లపాడు వరకు రోడ్డు నిర్మాణ పనులకు, రూ. 8 కోట్ల వ్యయంతో రావినూతల నుండి గోవిందాపురం వరకు బిటి రోడ్డు రెనివల్ పనులకు ఆయన శంఖుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, ట్రాన్స్‌కో ఎస్ఈ శ్రీనివాసచారి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ బి కళావతిబాయి, డిసిహెచ్ఎస్ డాక్టర్ రాజశేఖర్, ఖమ్మం ఆర్డీఓ జి నర్సింహరావు, పిఆర్ఇఇ వెంకట్‌రెడ్డి, ఏడిఏ విజయచందర్, తహసీల్దార్లు ఉషాశారద, పున్నంచందర్, ఎంపిడిఓ రురావత్ రమాదేవి, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ఏకలవ్య మోడల్ గురుకుల పాఠశాల ఫలితాల్లో మెరిసిన ఆదివాసి ముత్యం



**ప్రజాపక్షం/కరకగూడెం:** కరకగూడెం మండలం ఆదివాసి జెఎసి అధ్యక్షులు తాటిగూడెం గ్రామానికి చెందిన పోలెబోయిన వెంకటనారాయణ నాగరాణి దంపతుల కుమార్తె పోలెబోయిన అభిఘ్నశ్రీ ఏకలవ్య మోడల్ స్కూల్స్ యాజమాన్యం విడుదల చేసిన ఏకలవ్య మోడల్ గురుకుల పాఠశాల 10 వ తరగతి ఫలితాలలో 609/700 మార్కులు సాధించి స్కూల్ మొదటి స్థానం సాధించడం పట్ల తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. పోలెబోయిన అభిఘ్నశ్రీ దమ్మపేట మండలం, గండుగులపల్లి ఏకలవ్య మోడల్ గురుకుల పాఠశాల నుండి ప్రథమ స్థానం సాధించింది.

# తిర్నాటి సత్యనారాయణ సేవలు మరువలేనివి



**ప్రజాపక్షం/ అశ్వారావుపేట :** సిపిఐ సీనియర్ నాయకులు, ఎఐటీయూసి మాజీ జిల్లా నాయకులు తిర్నాటి సత్యనారాయణ సేవలు మరువలేనివని సిపిఐ అశ్వారావుపేట నియోజకవర్గ కార్యదర్శి సయ్యద్ సలీం అన్నారు. బుధవారం జంగారెడ్డి రోడ్డులోని సత్యనారాయణ స్థూపం వద్ద వర్థంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన స్థూపానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎంతో కాలంగా సిపిఐ పార్టీ కోసం కష్టపడి పనిచేశారని, ఎన్నో ఉద్యమాల్లో ప్రజలతో మమేకమై, ప్రజల కోసం పాటుపడ్డారని తెలిపారు. అశ్వారావుపేట మండలంలో సిపిఐ పార్టీ అభివృద్ధికి ఆయన ఎంతో కృషి చేశారని తెలిపారు. తిర్నాటి సత్యనారాయణ అకాల మృతి సిపిఐ పార్టీకి తీరని లోటన్నారు. సిపిఐ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమితి సభ్యులు మహమ్మద్ మాట్లాడుతూ తిర్నాటి సత్యనారాయణతో మాకు ఎంతో కాలంగా అవినాభావ సంబంధం ఉందని, ఎన్నో ప్రజా సమస్యలపై కలిసి పనిచేసిన అనుభవం ఉందని ఆయన అన్నారు. ఆయన స్ఫూర్తితో ముందు తరాల వారు పార్టీని ముందుకు నడిపించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఐటీయుసి మండల కార్యదర్శి పటాన్‌జలాల్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గిరిజన సమాఖ్య అధ్యక్షులు కారం దారయ్య, సిపిఐ టౌన్ సెక్రటరీ నూకవరపు విజయ్‌కాంత్, జక్కం బలరాం తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల నమోదు లక్ష్యంగా ఉపాధ్యాయులు పనిచేయాలి

**- కలెక్టర్ జితేష్ వి పాటిల్**



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదును పెంచే దిశగా ఉపాధ్యాయులు పనిచేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. జిల్లా విద్యాశిక్షణా కేంద్రంలో జరుగుతున్న వృత్యంతర శిక్షణ కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడారు. అర్హత గల ఉపాధ్యాయులే ప్రభుత్వబడుల్లో చదువులు చెబుతున్నారని, ప్రభుత్వ పాఠశాలలను, విద్యను కాపాడేందుకు ఉపాధ్యాయులు పట్టుదలతో పనిచేయాలన్నారు. ఇందు కోసం నాణ్యమైన విద్యను అందించడమే ఏకైక లక్ష్యం అన్నారు. ఇందు కోసం వృత్యంతర శిక్షణా కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయని చెప్పారు. రానున్న విద్యా సం. నుండి సాంకేతిక విధానాన్ని తరగతి గదుల్లో వినియోగించడం, మౌలిక భాష, గణిత అభివృద్ధి కార్యక్రమాన్ని కృత్రిమ మేధా ఆధారంగా అభివృద్ధి పరచడం, పాఠశాల విద్యలో నూతనంగా ప్రవేశపెడుతున్న కృత్రిమ మేధా పాఠ్యాంశాలను పిల్లలకు అందించడం అనే మూడు నూతన విషయాలతో ఈ కార్యక్రమం రూపొందించబడిందన్నారు. దీనిని ఉపాధ్యాయులు అందిపుచ్చుకుని ప్రభుత్వపాఠశాలల విద్యాభివృద్ధికి కృషి చేయాలన్నారు. పాఠశాలల మౌలిక వసతుల కల్పనకు తామెప్పుడూ సిద్ధంగానే ఉంటామని, వాటిని సాధ్యమైనంత వరకు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి వెంకటేశ్వరాచారి, జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి నాగరాజశేఖర్, జిల్లా ప్లానింగ్ కో ఆర్డినేటర్ ఎస్ సతీష్‌కుమార్, జిల్లా రిసోర్స్ పర్సన్లు, ఉపాధ్యాయనీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# 45రోజుల ఉచిత నైపుణ్య శిక్షణ



**ప్రజాపరక్షం/భద్రాచలం :** ఐటిడిఏ పరిధిలోని మండలాల నిరుద్యోగ యువతీ యువకులకు ఆర్‌సెట్, ఐటిసి ప్రథమ్ ద్వారా ఒక్కొక్క కోర్సుకు 10 రోజుల నుండి 45 రోజుల పాటు ఉచిత నైపుణ్య శిక్షణలు కల్పించేందుకు దరఖాస్తులు చేసుకోవాలని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి రాహుల్ తెలిపారు. బ్యూటీషియన్ శిక్షణ కొరకు దరఖాస్తు చేసుకునే వారు పదో తరగతి నుండి ఆ పై కోర్సులు చదివి ఉండాలని, వీరికి ముప్పై రోజుల పాటు ఉచిత శిక్షణ ఐటిసి ప్రథమ్ భద్రాచలంలో ఉంటుందన్నారు. అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్ శిక్షణకు 10వ తరగతి ఆ పై కోర్సులుచదివి ఉండాలని, వీరికి 45 రోజుల పాటు ఐటిసి ప్రథమ్ ఆధ్వర్యంలో శిక్షణ ఉంటుందన్నారు. టైలరింగ్, పుట్టగొడుగుల పెంపకం, జూట్ బ్యాగ్ తయారీలో కూడా శిక్షణ ఇస్తారని చెప్పారు. శిక్షణా కాలంలో ఉచిత భోజనంతో పాటు వసతి సౌకర్యం కల్పిస్తారని, ఆసక్తి గల వారు విద్యార్హత ధృవీకరణ పత్రాలు, రెండు ఫొటోలతు ఈనెల 21 ఉదయం ఐటిడిఇలో జరిగే ఇంటర్వ్యూకు హాజరుకావాలన్నారు. పూర్తి వివరాల కోసం 6302608905, 8143840906 నెబర్లను సంప్రదించాలని సూచించారు.

# కింగ్ ఫిషర్.. కేర్ ఆఫ్ బెల్ట్ షాప్

**-వైన్స్ షాపుల్లో దొరకని కింగ్ ఫిషర్ బీర్లు**
**-పట్టించుకోని అధికారులు**






**ప్రజాపక్షం/వైరా:** కింగ్ ఫిసర్ బీర్ అంటే మందు బాబుల్లో ఓ రకమైన క్రేజ్ ఉంటుంది. వైన్ షాపుకి వెళ్లిన బార్ షాప్‌కి వెళ్లిన కింగ్ ఫిసర్ బీర్‌ను ప్రతిఒక్కరూ అడుగుతారు. ఎక్కువ శాతం మందుబాబులకు కింగ్ ఫిసర్ అంటేనే ఎనలేని ప్రీతి. కాని అలాంటి కింగ్ ఫిసర్ బీర్ ఇప్పుడు వైన్ షాపుల్లో కనిపించడం లేదు. కింగ్ ఫిసర్ బీర్ అంటే కేరాఫ్ బెల్ట్ షాపు అనే విధంగా గల్లిగల్లికి ఏర్పాటు చేసిన బెల్ట్ షాపుల్లో కింగ్ ఫిసర్ బీర్ కనిపిస్తుంది. మరి వైన్ షాపుల్లో ఎందుకు ఇంత విలువ ఉన్న కింగ్ ఫిసర్ బీర్ వైన్స్ షాపు నిర్వాహకులు విక్రయించడం లేదు. దీనిపై జిల్లావ్యాప్తంగా ఎక్సైజ్ అధికారులు స్పందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఎందుకు అంటే కింగ్ ఫిషర్ బీర్ వైన్ షాపులో అమ్మకుండ కేవలం సిండికేట్ వ్యాపారంలో భాగంగా బెల్ట్ షాపుల నిర్వాహకుకే కింగ్ ఫిసర్ బీర్లను అమ్ముతున్నారు. ఇది వాస్తవంగా ఉన్న పలు నియోజకవర్గాల్లోని ఎక్సైజ్ అధికారులకు సమాచారం అందించిన కూడా కింగ్ ఫిషర్ బీర్ వ్యవహారంలో స్పందించకపోవడం పలు అనుమానాలకు తావిస్తుంది. ఒక్కొక్క కింగ్ ఫిషర్ బీర్‌కి బెల్ట్ షాపుల్లో రూ.50 నుంచి రూ.60లు అధికంగా తీసుకుంటున్నారు. ఇది కేవలం అధికారుల నిర్లక్ష్యం కాదా అధికంగా బీరుకు డబ్బులు చెల్లించాల్సిన పరిస్థితి ఎవరి వలన వచ్చింది? ప్రతి మండలంలోని ఉన్న వైన్ షాపుల నుండి గ్రామాల్లోని ప్రతి బెల్ట్ షాపుకు కింగ్ ఫిసర్ బీర్లను అందిస్తున్నారు. వైరాలో ఉన్న మద్యం డిపో నుండి ప్రతి మండలంలోని వైన్ షాపు నిర్వాహకులు ఎన్ని కేసుల కింగ్ ఫిసర్ బీర్లు దించుతున్నారు. ఆ కింగ్ ఫిషర్ బీర్లను వైన్ షాపులో ఎందుకు ఉంచడం లేదు. కేవలం బెల్టు షాపులకు పంపించే సిండికేట్ షాపు వద్ద వాటిని ఉంచి బెల్టు షాపులకు పంపిస్తున్నారు. దీనిపై అధికారులు నిర్లక్ష్యం తప్పిదం కాదా? జిల్లా ఎక్సైజ్ కమీషనర్ ఇప్పటికైనా జోక్యం చేసుకొని వైన్ షాపుల్లో కింగ్ ఫిషర్ బీర్లు ఎందుకు నిల ఉంచడంలో విచారణ చేపడితే వాస్తవాలు బయటకు వస్తాయి.

# ఎస్సీ నియోజకవర్గంగా మార్చాలి



**ప్రజాపక్షం/భద్రాచలం :** భద్రాచలం 119 శాసనసభా నియోజకవర్గాన్ని ఎస్సీ నియోజకవర్గంగా పునర్విభజన చేయాలని మాలమహానాడు జిల్లా ప్రధాన కార్యదర్శి అల్లాడి పాల్‌రాజ్ అన్నారు. బుధవారం స్థానిక ఏఎంసి కాలనీలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా ఏర్పడి సుమారు 10సం.లు కావస్తోందని, జిల్లాలో ఒక్క ఎస్సీ నియోజకవర్గం కూడా లేదని, ఉమ్మడి ఖమ్మం జిల్లాలో రెండు ఎస్సీ నియోజకవర్గాలు ఉన్నాయని అన్నారు. భద్రాచలం నియోజకవర్గంలో ఎస్సీలు అధికంగా ఉన్నారని, దాని ఆధారంగా నియోజకవర్గాల పునర్విభజన చేపట్టి భద్రాచలం గిరిజన నియోజకవర్గాన్ని హరిజన నియోజకవర్గంగా మార్పుచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డేగల శివ, వంశీ, న నానిబాబు,కాంతయ్య, ఏసు, శ్యామ్యేల్, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి, ప్రజా సంక్షేమమే ధ్యేయం

**- డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క**
**- ఎర్రుపాలెం మండలంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన**





**ప్రజాపక్షం/ఖమ్మం :** ఆర్థిక ఇబ్బందులను అధిగమిస్తూ ప్రజాసంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్నామని డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క అన్నారు. బుధవారం మధిర నియోజకవర్గ పర్యటనలో భాగంగా ఎర్రుపాలెం మండలంలో పర్యటించిన ఆయన పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. ఎర్రుపాలెం మండల కేంద్రంలో 50 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రం భవన నిర్మాణ పనులకు జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం ఎర్రుపాలెం మండలం కండ్రిక గ్రామంలో రూ.2.62కోట్లతో కండ్రిక నుండి పెద్దగోపవరం వరకు నిర్మించనున్న బిట్టి రోడ్డు నిర్మాణ పనులకు, బనిగండ్లపాడు గ్రామంలో బనిగండ్లపాడు నుండి బంజర రోడ్డు వరకు రూ.5.74కోట్లతో నిర్మించనున్న బిటి రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో డిప్యూటి సిఎం భట్టి మాట్లాడుతూ దశాబ్దాల కాలంగా ప్రజల ఆకాంక్ష మేరకు ఎర్రుపాలెం మండల హెడ్ క్వార్టర్‌లో రూ.22 కోట్లతో 50 పడకల ఆసుపత్రిని ప్రజా ప్రభుత్వం మంజూరు చేసి నేడు శంకుస్థాపన చేసుకుంటున్నామని తెలిపారు. ఆసుపత్రి నిర్మాణ పనులకు ప్రాధాన్యత క్రమంలో చేపట్టి వేగవంతంగా పూర్తి చేస్తామని తెలిపారు. గత సంవత్సర కాలంలో వైద్యశాఖ ద్వారా ప్రజా ప్రభుత్వం 11వేల 600కోట్ల రూపాయలను ఖర్చు పెట్టిందని అన్నారు. పేద, మధ్య తరగతి వర్గాలకు చెందిన 90లక్షల కుటుంబాలకు వైద్యం కోసం ఆస్తులు అమ్ముకోవాల్సిన దుస్థితి రావద్దని ఆరోగ్యశ్రీ పథకం కింద కార్పొరేట్ ఆసుపత్రుల్లో రూ.10లక్షల వరకు వైద్యం చేయించుకునేందుకు ఇందిరమ్మ ప్రభుత్వం ఏర్పాట్లు చేసిందన్నారు. పేదలకు 100రోజుల ఉపాధిహామీ పథకాన్ని పకడ్బందీగా అమలు చేస్తున్నామని, పేదల పిల్లల చదువుకునేందుకు వీలుగా రెసిడెన్షియల్ పాఠశాలలను నిర్వహిస్తున్నామని, ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో నూతనంగా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణ పనులు 11వేల 600కోట్లతో ప్రారంభించామని తెలిపారు. తెల్ల రేషన్ కార్డు ఉన్న 90లక్షలకు పైగా కుటుంబాలకు ఇంజనీరింగ్, ఫార్మసి, ఎంబిఏ వంటి పెద్ద పెద్ద కోర్సులు చదివేందుకు ఫీజు రీయంబర్స్‌మెంట్ పథకం అమలు చేస్తున్నామని, రేషన్ ద్వారా ప్రతి ఒక్కరికి 6కిలోల చొప్పున సన్నబియ్యం సరఫరా చేస్తున్నామన్నారు. అర్హులకు రూ.500 గ్యాస్ సిలెండర్ సరఫరా, 200 యూనిట్లు వరకు ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నామన్నారు. అలాగే యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేలా ప్రభుత్వం పరిధిలో ఉన్న ఖాళీలను పబ్లిక్ సర్వీస్ కమీషన్ ద్వార పరీక్షలు నిర్వహించి భర్తి చేస్తున్నామని తెలిపారు. స్వయం ఉపాధి యూనిట్ల స్థాపన కింద యువతను ప్రోత్సహించేందుకు 9వేల కోట్లతో రాజీవ్ యువ వికాసం పథకం జూన్ 2న రాష్ట్ర అవతరణ దినోత్సవం రోజు ప్రారంభిస్తున్నామని తెలిపారు. పేదలు ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా 22వేల 500 కోట్ల రూపాయలతో ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో 3500 ఇందిరమ్మ ఇండ్ల చొప్పున మంజూరు చేసి ఒక్కొక్కరికి రూ.5లక్షల రూపాయల ఆర్థిక సహాయం అందిస్తామని తెలిపారు. మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు ఇందిరా మహిళా స్త్రీ శక్తి పథకం ద్వారా వ్యాపాలు నిర్వహించేందుకు యూనిట్లు మంజూరు చేయటం జరుగుతుందని, మహిళా స్వాలంభన కోసం అనేక పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్, రాష్ట్ర గిడ్డండుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, ట్రాన్స్‌కో ఎస్ఇ శ్రీనివాసాచారి, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.కళావతిభాయి, డిసిహెచ్ఎస్ డాక్టర్ రాజశేఖర్, ఖమ్మం ఆర్డివో జి.నర్సింహారావు, పిఆర్ ఇఇ వెంకట్ రెడ్డి, ఎడిఏ విజయ్‌చందర్, తహశీల్దార్లు ఉషాశారద, పున్నంచందర్, ఎంపిడిఓలు, వివిధశాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో ఇంటర్ సప్లమెంటరీ పరీక్షలకు సర్వం సిద్ధం

**-38 పరీక్షా కేంద్రాలు.. 15,461 మంది విద్యార్థులు**
**-జిల్లా ఇంటర్ విద్యాశాఖాధికారి కె.రవిబాబు**

**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** జిల్లాలో ఇంటర్మీడియట్ సప్లమెంటరీ పరీక్షలకు సర్వం సిద్ధం చేసినట్లు జిల్లా ఇంటర్ విద్యాశాఖాధికారి కె.రవిబాబు తెలిపారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ లేజీని ఆకస్మికంగా సందర్శించారు. ఇంటర్ పరీక్షల పై ఆధ్యాపకులతో చర్చించారు. నూతనంగా విద్యార్థుల ప్రవేశాల పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జిల్లా లో ఈ నెల 22 నుంచి ఇంటర్ పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అందుకు తగ్గట్టుగా ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 38 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వారిలో 11,780 మంది ఇంటర్ మొదటి సంవత్సరం, 3,681 మంది ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు మొత్తం 15 461 మంది పరీక్షలు వ్రాయనున్నట్టు తెలిపారు. మొదటి సంవత్సరం విద్యార్థులకు ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పరీక్షలు నిర్వహణ కు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈ ఏడాది 77.09 శాతం ప్రభుత్వ కాలేజీలలో ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. వచ్చే ఏడాది నూరు శాతం ఫలితాల సాధన కు కృషి చేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ కాలేజీలలో ఫయిలైన విద్యార్థులకోసం పరీక్షలకు సిద్ధం చేసేందుకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామని అన్నారు. ఆఫ్ లైన్ లేదా ఆన్లైన్ లో కూడ తరగతులు చేపట్టినట్లు తెలిపారు. ఈ ఏడాది ప్రభుత్వ కాలేజీలలో చేరేందుకు వసతి గృహాలతో పాటు, ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాల గురించి వివరించేందుకు ఆధ్యాపకులు డోర్ టూ డోర్ ప్రచారం చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు ప్రభుత్వ కాలేజీలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆధ్యాపకులు పాల్గొన్నారు.

## ఎండదెబ్బ తగిలి ఉపాధి హామీ కూలి మృతి



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** ముదురుతున్న ఎండ తీవ్రత ఉపాధి కూలీల పై పడుతుంది. పనికి వెళ్లి అస్వస్థతకు గురై మృతి చెందిన ఘటన మండలం లో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. ఖమ్మం జిల్లా, నేలకొండపల్లి మండలంలోని చెరువుమాధారం గ్రామానికి చెందిన ఎస్.దానయ్య (55) అనే ఉపాధి కూలీ రోజు మాదిరిగానే గ్రామంలో ఉపాధి హామీ పథకం పనులకు వెళ్లాడు. అక్కడ ఎండ తీవ్రత వలన అస్వస్థతకు గురైయ్యాడు. పని అనంతరం ఇంటికి వచ్చి, వారి బంధువులతో మాట్లాడుతూనే కుప్పకూలి పడిపోయాడు. బంధువులు నేలకొండపల్లి ప్రభుత్వ హాస్పిటల్ కు తీసుకెళ్లగా వైద్యులు పరీక్షించి మృతి చెందాడని నిర్ధారణ చేశారు. మృతుడుకు భార్య, ఇరువురు కుమారులు కుమార్తె ఉన్నారు. ఉపాధి హామీ పథకం పనుల వద్ద కనీస సౌకర్యాలు లేక కూలీలు అస్వస్థతకు గురవుతున్నారని కూలీలుమండిపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కనీస సౌకార్యలు కల్పించాలని డిమాండ్ చేశారు.

# రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి



**కలెక్టర్ జితేష్ వి. పాటిల్**

**ప్రజాపక్షం/సుజాతనగర్:** భూ సమస్యలు ఉన్నవారు రెవెన్యూ సదస్సులో పాల్గొని దరఖాస్తులు అందజేసిన వెంటనే భూ సమస్యలు పరిష్కారం చేస్తామని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ పేర్కొన్నారు. భూ భారతి చట్టం అమలులో భాగంగా రెవెన్యూ సదస్సుల నిర్వహణకు పైలట్ ప్రాజెక్టుగా సుజాతనగర్ మండలం ఎంపికైన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా సుజాతనగర్ మండలంలోని సర్వరం, కోయగూడెం గ్రామాల్లో భూ భారతిలో భూ సమస్యలపై రైతులు ఇచ్చిన దరఖాస్తులను కలెక్టర్ పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఈ రెవెన్యూ సదస్సులో భూ రికార్డులలో పేర్లు తప్పులు, భూమి విస్తీర్ణం హెచ్చు తగ్గులు, వారసత్వ భూములు, భూ స్వభావం తప్పులు, నిషేధిత జాబితాలో ఉన్న భూ సమస్యలు, సర్వే నెంబర్ మిస్సింగ్, పట్టా పాస్ బుక్కులు లేకపోవడం, ప్రభుత్వ భూములను నవీకరించడం, సాదా బైనామా కేసులు, హద్దుల నిర్ధారణ, పార్ట్‌బిలో చేర్చిన భూముల సమస్యలు, భూసేకరణ కేసులు తదితర భూ సమస్యలకు సంబంధించి దరఖాస్తులు స్వీకరించి భూ భారతి కొత్త ఆర్.ఓ.ఆర్ చట్టం ప్రకారం అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేపడుతారన్నారు. అలాగే నిర్దేశిత గడువు లోపు భూములు పరిష్కరిస్తారన్నారు. మండలంలోని రెవెన్యూ గ్రామాల్లో సదస్సులు పూర్తయ్యాక జిల్లాలోని అన్ని మండలాల్లో జూన్ మొదటి వారంలో రెవెన్యూ గ్రామాల వారీగా సదస్సులు నిర్వహిస్తామన్నారు. అర్జీలు సమర్పించేందుకు వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని తహశీల్దార్‌ను అదేశాంచారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట కొత్తగూడెం ఆర్డీవో మధు, సుజాతనగర్ తహశీల్దార్ శిరీష, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి



**ప్రజాపక్షం/కొత్తగూడెం టౌన్ :** బుధవారం శేషగిరి భవనంలో ఏఐటియూసి కార్పొరేట్ బ్రాంచ్ సెక్రటరీ ఎస్వీ రమణమూర్తి అధ్యక్షతన లో అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఈ నెల 20వ తారీకు జరిగే దేశవ్యాప్త సమ్మె పై చర్చించి, సమ్మె జయప్రదం చేయడానికి తగిన ప్రణాళిక సిద్ధం చేసినట్లు సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ కార్పొరేట్ బ్రాంచ్ కార్యదర్శి సభాధ్యక్షులు ఎస్.వి. రమణమూర్తి తెలిపారు. కావున యావత్తు సింగరేణి కార్మికులు అన్ని రంగాల కార్మికులు సమ్మెలో పాల్గొని సమ్మెను విజయవంతం చేయుట ద్వారా కార్మిక వ్యతిరేకి, పెట్టుబడి దారుల పక్షపాతి ఈ దేశ ప్రధాని మోడి కళ్ళు తెరిపించాలని కార్మికులకు పిలుపు నిచ్చారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేయనున్న 4 లేబర్ కోడ్స్ ను వెంటనే రద్దు చేయాలి. సింగరేణి లో నూతన బొగ్గు గనులను ఏర్పాటు చేయాలి. కార్మికులకు స్వంత ఇంటి పథకం అమలు చేయాలి. పెర్క్స్ పై విధిస్తున్న ఇన్కమ్ టాక్స్ ను తిరిగి కార్మికులకు యాజమాన్యం చెల్లించాలి. కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనం ప్రతి నెల రూ. 26 వేలు ఇవ్వాలి. ప్రతి కార్మికునికి కనీస పెన్షన్ రూ. 9 వేలకు తగ్గ రాదు.అని ఆయన ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ అడిషనల్ జనరల్ సెక్రటరీ మిర్యాల రంగయ్య, సెంట్రల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ వీరాస్వామి, త్యాగరాజన,తాంబరం, మంద నరసింహారావు, కూసాన వీరభద్రయ్య, రాజారాం, శ్రీనివాస్, సురేందర్, రాము, క్రిస్టఫర్ నితిన్, రవీందర్, రామ శంకర్, దేవదాసు విజయ, సందీప్, షకీర్, కావ్య తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ మేనేజర్‌కు వినతి



**ప్రజాపక్షం/కొత్తగూడెం టౌన్ :** కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలో ఉన్న ఇందిరమ్మ ఇండ్ల ఎంపిక లో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక ఇందిరమ్మ కమిటీలకు సంబంధం లేకుండా, మాజీ కౌన్సిలర్లు, అధికార పార్టీ నాయకులు అర్హులు కాని వారికి ఇండ్లు మంజూరు చేశారని, ఎంపిక విషయాలలో భారీగా అవకతవకలు జరిగాయని భారతీయ జనతా పార్టీ కొత్తగూడెం పట్టణ అధ్యక్షుడు శీలం విద్యాసాగర్ ఆధ్వర్యంలో బుధవారం నాడు కొత్తగూడెం మున్సిపాలిటీ అధికారికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, ఇందిరమ్మ ఇంటి ఎంపిక విషయాలలో ప్రభుత్వ అధికారులు స్పందించి చర్యలు తీసుకొని అర్హులైన పేదవారికి ఈ పథకం ద్వారా లబ్ధి చేకూర్చాలని కోరారు. లేనిపక్షంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో మున్సిపాలిటీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు గొడుగు శ్రీధర్ యాదవ్, గూడ విజయ, గుంపుల మహేష్, రాంబాబు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్థిక స్వాతంత్ర్యంతో మహిళలకు సొంత అస్థిత్వం సాధ్యం






**-అర్హులకు యువ వికాసం క్రింద స్వయం ఉపాధి యూనిట్ల మంజూరు : కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్**

**ప్రజాపక్షం/ఖమ్మం :** ఆర్థిక స్వాతంత్ర్యంతో మహిళలకు సొంత అస్థిత్వం సాధ్యమవుతుందని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. పాన్ ఇండియా స్థాయిలో 10 జిల్లాల్లో అమలవుతున్న డిజిటర్ ఇండియా కామన్ సర్వీస్ సెంటర్ ప్రాజెక్టును సుగమ్య భారత మార్గదర్శకాల్లో భాగంగా ఖమ్మంను పైలెట్ ప్రాజెక్టు క్రింద ఎంపిక చేసింది. ఇందులో భాగంగా బుధవారం తరుణి హాట్‌లో నిర్వహిస్తున్న ఎస్‌బిఐ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించారు. వ్యాపార నైపుణ్య శిక్షణ పొందిన వారితో కలెక్టర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటికీ మన సమాజంలో పురుషులతో సమానంగా మహిళలకు అవకాశాలు అందడం లేదని అన్ని రంగాల్లో మహిళలు రాణిస్తున్నప్పటికీ కొంత వివక్ష ఉందని దానిని నిర్మూలించేందుకు మనమంతా కృషి చేయాలన్నారు. మానవ సంబంధాలతో పాటు సొంత అస్థిత్వం ఉండటం చాలా కీలకమన్నారు. మన బ్యాంకు ఖాతాల్లో డబ్బులు ఉంటేనే మనకు సొంతంగా అస్థిత్వం ఉంటుందని మహిళలు ఇతరులపై ఆధారపడకుండా ఉండేందుకు స్వయం ఉపాధి యూనిట్ల స్థాపనకు ఇందిరా మహిళాశక్తి వివిధ కేంద్ర పథకాల క్రింద ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా అమలు చేస్తున్న రాజీవ్ వికాసం పథకం క్రింద అందరికీ సహకారం అందించడం జరుగుతుందని తెలిపారు. ముందుగా దివ్యాంగ మహిళలచే జిరాక్స్ కేంద్రాలను ప్రారంభిస్తామని అనంతరం దశల వారీగా కామన్ సర్వీస్ సెంటర్ వద్ద శిక్షణ తీసుకున్న మహిళలకు కూడా కేటాయిస్తామన్నారు. అధికారులపై నమ్మకంతో ప్రజలు కార్యాలయాలకు వచ్చేలా సానుకూల దృక్పథంతో జిల్లా యంత్రాంగం పని చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు డిఆర్‌డివో నూరుద్దీన్, ఎస్‌బిఐ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా కేంద్రం డైరెక్టర్ చంద్రశేఖర్, బేతోజు హరికృష్ణకుమార్, ఫయాజ్, సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

# ఆడపిల్లలు ఉన్న ఇల్లు సంతోషాల హరివిల్లు : కలెక్టర్





**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** సమాజంలోని ఆడపిల్లలు ప్రతి రంగంలో రాణించి ఉత్తమ ప్రతిభతో మొదటి స్థానంలో ఉంటున్నారని ఆడపిల్లలు ఉన్న ఇల్లు సంతోషాల హరివిల్లుగా నిలుస్తుందని ఖమ్మం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. ప్రతి బుధవారం జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న మా పాప మా ఇంటి మణిదీపం కార్యక్రమంలో భాగంగా ఎర్రుపాలెం మండలం పెద్దగోపవరం గ్రామంలో కోటేశ్వరి కుటుంబ సభ్యులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు కలెక్టర్‌ను ప్రత్యేకంగా స్వాగతించారు. గూడూరు కోటేశ్వరి, లక్ష్మి నారాయణరెడ్డి దంపతులకు 16 ఏప్రిల్ 2025న ఆడపిల్ల పుట్టిన విషయం తెలుసుకుని వారి ఇంటికి వచ్చిన కలెక్టర్ పాప తల్లిదండ్రులతో పాటు వారి కుటుంబ సభ్యులతో కలిసి స్వీట్ బాక్స్, ఫ్రూట్స్, సర్టిఫికెట్, బట్టలు అందించి శుభాకాంక్షలు తెలిపి శాలువతో సన్మానించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అమ్మాయిల భవిష్యత్తుకు తల్లిదండ్రులు, కుటుంబం భరోసాగా ఉండాలని తెలిపారు. ఆడపిల్లలు ప్రతి రంగంలో రాణించి మొదటి మూడు స్థానాల్లో వారే ముందుంటున్నారని తెలిపారు. మహిళలు అంతరిక్షానికి వెళ్లి వస్తున్న తరుణంలో తల్లిదండ్రులు తమ ఇంట్లో జన్మించిన ఆడపిల్లకు అండగా ఉండి ఎదగనిచ్చి మంచిగా చదివించి ఉన్నత స్థానంలో ఉండేలా తీర్చిదిద్దాలని ఆయన సూచించారు. ఖమ్మంజిల్లాలో ఏ ఇంట్లో ఆడ పిల్ల పుట్టిన జిల్లా అధికారులు వారి ఇండ్లకు వెళ్లి తల్లిదండ్రులకు స్వీట్ బాక్స్ ఇచ్చి మంచి సందేశం అందించాలని తెలిపారు. మహాలక్ష్మి ఇంట్లో పుట్టినందుకు శుభాకాంక్షలు తెలపాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించామని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖాధికారి రాంగోపాల్‌రెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిణి డాక్టర్ కళావతిబాయి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# విధులకు గైర్హాజరవుతున్న కార్మికులకు కౌన్సిలింగ్

**ప్రజాపక్షం/కొత్తగూడెం టౌన్ :** కొత్తగూడెం ఏరియాలోని రుద్రంపూర్ నందు గల ఆర్.సి.ఓ.ఎ క్లబ్ నందు కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఎం.షాలేం రాజు ఆదేశానుసారం 2025 సంవత్సరంలో జనవరి నుండి ఏప్రిల్ వరకు 60 మాస్టర్లు, అంతకన్నా తక్కువ మాస్టర్లు చేసిన ఉద్యోగులకు వారి కుటుంబ సభ్యులతో గైర్హాజరు హాజరవుతున్న ఉద్యోగులకు విధులకు హాజరవ్వాలని కౌన్సిలింగ్ ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విధులకు గైర్హాజరు అవుతూ ఈ ఉద్యోగులను వారి కుటుంబ సభ్యుల సమక్షంలో గైర్హాజరు కాకుండా విధులకు హాజరయ్యేలా వారిని ప్రోత్సహించడానికి ఈ కౌన్సిలింగ్ కు పిలవడం జరిగిందని అన్నారు. కౌన్సిలింగ్ కు 295 ఉద్యోగులను కౌన్సెలింగ్ కు పిలవడం జరిగిందని, వారిలో కౌన్సిలింగ్ కు 140 మంది ఉద్యోగులు హాజరైనారని, హాజరైన ప్రతి ఉద్యోగి గైర్హాజరు అవుటకు గల కారణాలను జిఎం ఈ సందర్భంగా అడిగి తెలుసుకున్నారు. అలాగే మెడికల్ కారణంగా విధులకు హాజరుకాని ఉద్యోగులను సంబంధిత అధికారులతో వారి ఆరోగ్య స్థితిగతులను మెడికల్ డిపార్ట్మెంట్ వారితో రివ్యూ చేయించాలని సూచించారు. ఈ కౌన్సిలింగ్ కు సంబంధిత అధికారులు, మెడికల్ సూపర్డెంట్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. గైర్హాజరుకు కారణాలు అడిగి



తెలుసుకొని, గైర్హాజరు వలన వారికి, వారి కుటుంబాలకు, సంస్థకు కలిగే నష్టాలను వివరించి రోజువారీగా విధులకు హాజరవ్వాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ జె.గట్టయ్య, ఐఎన్టీయూసీ వైస్ ప్రెసిడెంట్ ఎండి.రజాక్, ఎస్ ఓ టు జిఎం జీవి కోటిరెడ్డి, డిజిఎం పర్సనల్బ శివ కేశవరావు, ఏజెంట్ పద్మావతి ఖని బి.రవీందర్, మేనేజర్ పద్మావతి ఖని, ఎం.వి.ఎన్ శ్యాం ప్రసాద్, డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి, డివైపిఎం హరీష్ గోవర్ధన్, సీనియర్ పిఓలు మజ్జి.మురళి, కే.దేవదాస్, డి.విజయ సందీప్, జి.సంఘమిత్ర, షకీల్, కావ్య, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

# చిరుత సంచారం వదంతులు నమ్మొద్దు

**ప్రజాపక్షం/ అశ్వారావుపేట :** అశ్వారావుపేట పట్టణ సమీపంలో చిరుత సంచార వదంతులు బుధవారం ఉదయం వ్యాపించాయని, వదంతలు నమ్మొద్దని అశ్వారావుపేట అటవీశాఖ రేంజ్ అధికారి మురళీ తెలిపారు. అశ్వారావుపేట పట్టణ సమీపంలోని పాపిడిగూడెం, పేటమాలపల్లి మధ్య అటవీ ప్రాంతం నుండి రైతుల పంట పొలాలైన కొబ్బరి తోటల్లో చిరుత సంచరిస్తుందని కొందరు వ్యక్తులు ద్వారా సమాచారం తెలుసుకున్న రేంజ్ అధికారి తన సిబ్బందితో వెళ్లి సమీపంలోని కొబ్బరి తోట, అటవీ ప్రాంతాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. ఆ ప్రాంతంలో వచ్చిన వదంతలు ప్రకారం చిరుత పులి పాద ముద్రల కోసం పరిశీలించటంతో ఎక్కడ కన్పించలేదని, చిరుత సంచారం వదంతలేనని తెలిపారు. ఎటువంటి చిరుత సంచారం జరుగలేదని, ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఎఫ్ఆర్ఓ తెలిపారు. ఈ విషయంపై సోషల్ మీడియా మాధ్యమాల్లో ఒక్కసారిగా వ్యాప్తి చెందడంతో ప్రజలు ఆందోళనకు గురయ్యారు. ఆ ప్రాంత రైతులు, వ్యవసాయ కూలీలు సైతం తీవ్రమైన భయాందోళనలకు గురయ్యారు. అధికారుల ప్రకటనతో ఊపిరి పీల్చుకున్నారు.

# బడులు తెరిచే నాటికి అందుబాటులోనికి పాఠ్యపుస్తకాలు

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** బడులు తెరిచే నాటికి అన్ని రకాల పాఠ్యపుస్తకాలు అందుబాటులోకి వస్తాయని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. బుధవారం ఆయన కొత్తగూడెంలోని జిల్లా పాఠ్యపుస్తకాల గోదామును పరిశీలించారు. ఇప్పటికే 70 శాతం పాఠ్యపుస్తకాలు జిల్లాకు చేరుకున్నాయని, మిగిలినవి ఈనెల 25లోపు చేరుకుంచాయని చెప్పారు. అనంతరం ప్రతీ మండలానికి జిల్లా కేంద్రం నుండి పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తారని తెలిపారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఆయా మండలాల విద్యాశాఖాధికారుల నుండి పుస్తకాలు తీసుకోవాలని చెప్పారు. వీటిని తీసుకుని బడులు తెరిచిన మొదటి రోజున వాటిని విద్యార్థులకు పంపిణీ చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి ఎం వెంకటేశ్వరచారి, జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి నాగశేఖర్, జిల్లా ప్లానింగ్ కో ఆర్డినేటర్ ఎస్ సతీష్‌కుమార్ పాల్గొన్నారు.



# పోగొట్టుకున్న ఫోన్లు అందించిన ఎస్‌పి

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** జిల్లా వ్యాప్తంగా మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్న బాధితులు సిఇఐఆర్ పోర్టల్ ద్వారా రికవరీ చేసి తిరిగి బాధితులకు ఎస్‌పి రోహిత్ రాజ్ అందజేశారు. ఈ మేరకు బుధవారం తన కార్యాలయంలో 150 రికవరీ ఫోన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఫిర్యాదులో పేర్కొన్న అన్ని రకాల వివరాలు ఖచ్చితంగా నిర్ధారించుకుని సంబంధిత ఫోన్లను ట్రాక్ చేసి కనిపెట్టడం జరిగిందని తెలిపారు. గడిచిన ఐదు మాసాల కాలంలో 743 ఫోన్లు రికవరీ చేసి బాధితులకు అప్పగించినట్లు చెప్పారు. పోగొట్టుకున్న ఫోన్ల వివరాలు పోర్టల్‌లో ఖచ్చితత్వంతో నమోదు చేస్తే తిరిగి పొందేందుకు వీలుంటుందని ఎస్‌పి చెప్పారు. ఫోన్లు పోగొట్టుకున్న వారి పోర్టల్‌లో పూర్తి వివరాలతో నమోదు చేసుకుంటే ట్రాక్ చేసి ఫోన్ల ఆచూకి కనిపెట్టి రికవరీ చేస్తామన్నారు. పోయిన ఫోన్‌ను అవతలి వ్యక్తి వినియోగించేందుకు ప్రయత్నించినప్పుడు మాత్రమే ట్రాక్ చేయడం సాధ్యపడుతుందన్నారు. ఫోన్లు రికవరి చేయడంలో కృషి చేసిన పోలీస్ అధికారులను ఈ సందర్భంగా ఎస్‌పి అభినందించి వారికి ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బి సిఐ శ్రీనివాస్ , ఐటిసెల్ ఇంచార్జ్ సిఐ రాము, ఎస్సై సురేష్, ఐటిసెల్ సభ్యులు నవీన్, నరేష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.




# 20న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో ఆర్‌టిసి కార్మికులు పాల్గొనాలి

**ప్రజాపక్షం/ఇల్లెందు:** ఈనెల20న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో ఆర్టీసీ కార్మికులు పాల్గొనాలని సీఐటీయూ జిల్లా సహాయకార్యదర్శి అబ్దుల్‌నభీ, ఎస్‌డబ్ల్యూఎఫ్ డిపో కార్యదర్శి జే.ఉపేంద్రచారి పిలుపునిచ్చారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో బుధవారం స్టాఫ్, వర్కర్స్ ఫెడరేషన్ డిపో అధ్యక్షుడు ఐ.వెంకటేశ్వర్లు అధ్యక్షతన ఏర్పాటైన సాధారణ సమావేశంలో మాట్లాడారు. కేంద్రంలో భాజపా ప్రభుత్వ ప్రధాని నరేంద్రమోడీ కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా పనిచేస్తున్నారని, కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్నదని, 29చట్టాలను రద్దు చేసి వాటి స్థానంలో తెచ్చిన 4 లేబర్‌కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఈనెల20న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో తాళ్లూరి కృష్ణ, డి.అంజన్న, ఎ.ఉమాదేవి, పి.లక్ష్మణ్‌రావు, కె.కోటయ్య తదితరులు పాల్గొన్నారు.




# సమ్మె, గ్రామీణ బంద్‌ను జయపద్రం చేయండి

**ప్రజాపక్షం/కారేపల్లి:** కార్మిక కర్షక మైత్రితో కార్మికులు రైతులు వ్యవసాయ కార్మికులు సమస్యల పరిష్కారానికై మే 20న జరిగే సార్వత్రిక సమ్మె గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని కార్మిక, రైతు, కూలీ సంఘాల ఆధ్వర్యంలో జరిగిన రౌండ్ టేండ్ సమావేశంలో వక్తలు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక భాగం రామ నరసయ్య భవనంలో రైతు కూలి సంఘం నాయకులు వై ప్రకాష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వక్తలు మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా జరుగుతున్న సార్వత్రిక సమ్మె, గ్రామీణ బంద్ కార్యక్రమం నరేంద్ర మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జరుగుతున్నదని తెలిపారు. ఈ సమ్మె, గ్రామీణ బంద్‌లో కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీల ఐక్యంగా కలిసి రావాలని పిలుపునిచ్చారు. ఈ రౌండ్ టేండ్ సమావేశంలో సిఐటియూ మండల కన్వీనర్ కే నరేంద్ర, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కొండబోయిన నాగేశ్వరరావు, ఐఎన్టీయూసీ నాయకులు టీ చంద్ర ప్రకాష్, రైతు సంఘం మండల కార్యదర్శి వజ్జ రామారావు, వ్యకాస మండల అధ్యక్షులు వై రవి, ఏఐటియూసి నాయకులు బోళ్ళ రామస్వామి, టియుసిఐ నాయకులు సక్రు, అంగన్వాడీ యూనియన్ ప్రాజెక్ట్ కార్యదర్శి ఎస్ నాగమణి, ఆశా వర్కర్ సీనియర్ జిల్లా నాయకురాలు ఎల్లబోయిన రాధ, బిల్డింగ్ వర్కర్ సీనియర్ మండల అధ్యక్షులు కేలోత్ రవి, గ్రామ పంచాయితీ యూనియన్ మండల కార్యదర్శి ఎస్‌కే హుస్సేన్, రైతు కూలి సంఘం నాయకులు సత్తిరెడ్డి, ఏఐకేఎస్ నాయకులు తలారి దేవ ప్రకాష్, మహిళా సంఘం మండల కార్యదర్శి కే ఉమావతి, బోళ్ల కొమరయ్య, పాలిక తిరుపయ్య, పూనేం వెంకటలక్ష్మి , తదితరులు పాల్గొన్నారు.

